


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 26.12.2025 | సంపుటి : 2 | సంచిక :320 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI Friday 26.12.2025 volume : 2 Issue : 320 Pages : 8 Cost : 2/-

## విలేకరులు కావలెను


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

## ఆర్టికల్ 370 గోడను కూల్చే అదృష్టం
# మాకే దక్కింది

### కాంగ్రెస్‌లో ఒక కుటుంబాన్నే కీర్తించడం దారుణం



- కేవలం ఒక్క కుటుంబం కోసమే వారసత్వ రాజకీయాలు చేశారు
- కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శల జడి
- లక్నోలో జాతీయ స్మారకం 'రాష్ట్రీయ ప్రేరణ స్థల్'ను ఆవిష్కరించిన ప్రధాని

భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ జయంతి సందర్భంగా ఆయన భారీ కాంస్య విగ్రహంతో కూడిన జాతీయ స్మారకం 'రాష్ట్రీయ ప్రేరణ స్థల్'ను లక్నోలో ఆవిష్కరించిన సందర్భంగా విపక్ష కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శల జడివాన కురిపించారు. దశాబ్దాలుగా అభివృద్ధికి అవరోధంగా తయారైన 'ఆర్టికల్ 370'గోడను బద్ధలు కొట్టే అదృష్టం తమ ప్రభుత్వానికి దక్కడంపై బీజేపీ ఎంతో గర్విస్తోందని మోదీ వ్యాఖ్యానించారు.

02



తిరుమల కొండకు
## పోటెత్తిన భక్తులు

04

దర్శనానికి 30 గంటల సమయం

తిరుమల కొండ భక్తులతో కిటకిటలాడుతోంది. వరుస సెలవుల నేపథ్యంలో శ్రీవారిని దర్శించుకునేందుకు జనం భారీగా తరలివ చ్చారు. దీంతో శ్రీవారి సర్వదర్శనానికి 30 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు, నారాయణగిరి షెడ్లు భక్తులతో నిండిపోయాయి. శిలాతోరణం క్యూలైన్ వరకు భక్తులు వేచి ఉన్నారు. అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్ల కోసం రద్దీ నెలకొంది.




## 12 జోన్లు..
# 60 సర్కిల్స్

- జీహెచ్ఎంసీపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- జీహెచ్ఎంసీ డీలిమిటేషన్‌కు సంబంధించి తుది నోటిఫికేషన్ విడుదల

జీహెచ్ఎంసీపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ పరిధిని ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించడంతో పాటు, జోన్లు సర్కిల్స్ సంఖ్యను పెంచుతూ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటి వరకు ఉన్న 6 జోన్లను 12కు పెంచుతూ, 30 సర్కిల్స్‌ను 60కు పెంచినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

02

తెలంగాణలో పలువురు
## ఐఏఎస్‌ల బదిలీ

### కీలక స్థానంలో జయేశ్ రంజన్




**హైదరాబాద్:** తెలంగాణలో పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మెట్రో పాలిటన్ ఏరియా ప్రత్యేక సీఎస్‌గా జయేశ్ రంజన్‌ను నియమించింది. పర్యాటక శాఖ ప్రత్యేక సీఎస్‌గానూ కొనసాగుతారు. సిరిసిల్ల కలెక్టర్‌గా ఉన్న హరితను టీజీపీఎస్సీ కార్యదర్శిగా బదిలీ చేసింది. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా హేమంత్ సహదేవ్‌రావ్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా అపూర్వ చౌహాన్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌గా సందీప్ సుల్తానియా, చార్మినార్ జోనల్ కమిషనర్‌గా ఎస్. శ్రీనివాస్‌రెడ్డి, గోల్కొండ జోనల్ కమిషనర్‌గా జి.ముకుంద్‌రెడ్డి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా

మిగతా 2 లో

## సైనికులు ఇన్‌స్టాగ్రామ్ వాడొచ్చు

### ఆర్మీ కీలక నిర్ణయం

సైనికులు సామాజిక మాధ్యమాలను వినియోగిం చడంపై కఠిన వైఖరి అవలంబిస్తూ వచ్చిన భారత రక్షణశాఖ.. తాజాగా ఈ నిబంధనలను కాస్త సడలించింది. జవాన్లు, సైనికాధికారులు ఇన్‌స్టాగ్రామ్‌ను వీక్షించేందుకు అనుమతి కల్పించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రక్షణశాఖ వర్గాలను ఉ టంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఇందుకు కొన్ని షరతులు కూడా విధించినట్లు సమాచారం.



06



తెలంగాణ బీజేపీ
## కీలక నిర్ణయం

- నీటి ప్రాజెక్టులపై అధ్యయనం కోసం ప్రత్యేక కమిటీ
- ప్రాజెక్టులను సందర్శించనున్న కమిటీ సభ్యులు

02

## భారీ ఎన్‌కౌంటర్

- మావోయిస్ట్ కీలక నేత గణెళిశ్ హతం
- మొత్తం నలుగురు మృతి చెందినట్లు వెల్లడి

ఒడిశాలోని కందమాల్ జిల్లా గుమ్మా అటవీ ప్రాంతంలో మావో యిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో మావోయిస్టు కీలక నేత, కేంద్ర కమిటీ సభ్యుడు పాకా హనుమంతు అలియాస్ గణెళిశ్ ఉయికే ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆయనపై రూ.1.10 కోట్ల రివార్డు కూడా ఉందని తెలిపారు.

04



ఫోన్ ట్యాపింగ్ కేసులో
## కీలక పరిణామం

- నిందితులందరినీ పిలిచి విచారించిన సిట్
- పెన్‌డ్రైవ్ డేటా ఆధారంగా ప్రశ్నల వర్షం

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితులందరినీ సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిషన్‌రావు, తిరుపతన్నలను పిలిచిన సిట్.. వారిని విచారించింది.

02



కర్ణాటకలో
# ఘోర బస్సు ప్రమాదం

టూరిస్ట్ బస్సును ఢీకొన్న కంటెయినర్ లారీ
మంటలు చెలరేగడంతో 17మంది బుగ్గి

- క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో చికిత్స
- రాష్ట్రపతి, ప్రధాని మోడీ సంతాపం



**బెంగళూరు, డిసెంబర్ 25 :** కర్నాటకలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును లారీ ఢీ కొట్టడంతో బస్సులలో మంటలు చెలరేగి 17 మంది సజీవ దహనమయ్యారు. మరో మరో 13 మంది గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన చిత్రదుర్గ జిల్లా జవరగుండనహళ్లి శివారులో తెల్లవారు 3 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. బెంగళూరు నుంచి గోకర్ణం వెళ్తున్న బస్సును లారీ ఢీ కొట్టింది. లారీ డ్రైవర్ సహా 17 మంది మృత్యువాత పడ్డారు.

మిగతా 2 లో



నగరంలో విస్తృతంగా
## డ్రంకెన్ డ్రైవ్‌లు

తాగి వాహనాలు నడపరాదని పోలీసుల హెచ్చరిక

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు ప్రారంభించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. బుధవారం ప్రారంభమైన ఈ తనిఖీలు డిసెంబర్ 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

03

వేలకోట్లు సంపాదనలో
# ఆ ఇద్దరు మంత్రులు

- అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లక తప్పదు
- కొంతమంత్రి మంత్రులు భూ దందాలతో సంపాదన
- దీనిని తామే ఎప్పటికైనా బయటపెడతాం
- సిఎంగా రేవంత్ భాష పద్ధతిగా లేదు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు



రాష్ట్రంలో ఇద్దరు మంత్రులు వేల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు . వారిపై ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థల నిఘా ఉందన్నారు. ఎప్పటికైనా ఆ ఇద్దరు రాష్ట్రమంత్రులు జైలుకెళ్లడం ఖాయమని సంచలన కామెంట్స్ చేశారు.

04




# 12 జోన్లు.. 60 సర్కిల్స్

- జీహెచ్ఎంసీపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- జీహెచ్ఎంసీ డీలిమిటేషన్‌కు సంబంధించి తుది నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్:** జీహెచ్ఎంసీపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ పరిధిని ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించడంతో పాటు, జోన్లు సర్కిల్స్ సంఖ్యను పెంచుతూ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటి వరకు ఉన్న 6 జోన్లను 12కు పెంచుతూ, 30 సర్కిల్స్‌ను 60కు పెంచినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కొత్తగా ఏర్పాటైన జోన్లలో ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, శంషాబాద్, గోల్కొండ, రాజేంద్రనగర్ ఉన్నాయి. ఈ కొత్త జోన్లలో ప్రత్యేక జోనల్ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే, వార్డు ఆఫీసుల్లో కొత్త సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటవుతాయి. త్వరలోనే ఈ కొత్త జోనల్, సర్కిల్ కార్యాలయాల ద్వారా పరిపాలన కొనసాగనుంది. జీహెచ్ఎంసీ వార్డుల డీ లిమిటేషన్‌పై కూడా ప్రభుత్వం ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 300 వార్డులు ఖరారు చేశారు. ఈ నెల 9న ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు, పదిరోజుల పాటు ప్రజల అభ్యంతరాలను స్వీకరించారు. ఈ సమయంలో 6 వేలకు పైగా అభ్యంతరాలు అందాయి. వాటిలో సహేతుకమైన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, ఈరోజు ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నిర్ణయంతో జీహెచ్ఎంసీ పరిధిలో పరిపాలన మరింత విస్తృతమవుతుంది. ప్రజలకు సమీపంలోనే జోనల్, సర్కిల్ కార్యాలయాలు ఉండటం వల్ల స్థానిక సమస్యలు త్వరగా పరిష్కారం కానున్నాయి. కొత్త వార్డుల ఏర్పాటుతో ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## కర్నాటకలో ఘోర బస్సు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాద సమయంలో బస్సులో 29 మంది ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. బెంగళూరు నుంచి గోకర్ణ వెళ్తున్న సీబర్డ్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును కంటెయినర్ లారీ ఢీకొట్టింది. లారీ.. డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 17 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. చిత్రదుర్గ జిల్లాలోని జాతీయ రహదారి-48పై గోర్లత్తు క్రాస్ వద్ద గురువారం వేకువజామున 2.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో 32 మంది ప్రయాణికులు ఉన్నారు. చిత్రదుర్గ, తుమకూరు జిల్లాల పరిధిలోని అధికార యంత్రాంగం ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి అతివేగం, పొగమంచు కారణమని భావిస్తున్నారు. బస్సుతో పాటు కంటెయినర్ లారీకి కూడా మంటలు వ్యాపించాయి. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్, కో డ్రైవర్ అందులోంచి దూకి తప్పించుకున్నారు. మరికొందరు ప్రయాణికులు అద్దాలను పగులగొట్టి ప్రాణాలు కాపాడుకున్నారు. వారిలో గగన, రక్షిత అనే యువతులు ఉన్నారు. తమ స్నేహితురాలు రష్మి కనిపించడం లేదని వారు కన్నీరుమున్నీరయ్యారు. ప్రయాణికుల్లో కొంతమందికి గాయాలు కావడంతో వారిని సిరా, హిరాయూరు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రయాణికుల్లో కొందరి పేర్లను అధికారులు గుర్తించారు. ఆ వివరాల ప్రకారం.. బస్సులో మంజునాథ్, సంధ్య, శశాంక్, దిలీప్, ప్రీతీశ్వరన్, వి బిందు, కె కవిత, అనిరుధ్ బెనర్జీ, అమృత, కల్పన, ప్రజాపతి, ఎం శశికాంత్, విజయ్ భండారీ, నవ్య, అభిషేక్, హెచ్.కిరణ్‌పాల్, ఎం.కీర్తన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పీఎం రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం అందించనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

**హైదరాబాద్, డిసెంబర్ 25 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితులందరినీ సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిషన్‌రావు, తిరుపతన్నలను పిలిచిన సిట్.. వారిని విచారించింది. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణ గురువారంతో ముగియనుండటంతో అందిరితో కలిపి దర్యాప్తు చేస్తోంది సిట్. అందులోభాగంగా ఇప్పటికే సిట్ అధికారి రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా సిట్ ఆఫీసుకు చేరుకున్నారు. ప్రభాకర్ రావు 14 రోజుల విచారణ ముగియనుండగా.. శుక్రవారం 10 గంటలకు పోలీస్ కస్టడీ నుంచి విడుదల కానున్నారు. అయితే.. 14 రోజుల కస్టడీలో ప్రభాకర్‌రావు ఏం చెప్పారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అనేక ప్రశ్నలకు ఎస్ఐబీ మాజీ చీఫ్ సమాధానం చెప్పనట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించి పెన్ డ్రైవ్‌ను సిట్ అధికారులు కీలక ఆధారంగా భావించారు. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా పని చేసిన కాలంలో పెన్ డ్రైవ్‌లో ట్యాపింగ్ వివరాలు స్టోర్ చేసినట్లు సిట్ గుర్తించింది. ఈ పెన్ డ్రైవ్ డేటాను ప్రభాకర్ రావు ముందు పెట్టి మరీ విచారించింది సిట్. అయితే 6 వేల ఫోన్ నెంబర్లు ఉన్నప్పటికీ పెన్‌డ్రైవ్‌పై ప్రభాకర్ రావు ఎలాంటి జవాబు ఇవ్వనట్లు సమాచారం.

# ఆర్టికల్ 370 గోడను కూల్చే అదృష్టం మాకే దక్కింది

**లక్నో :** గురువారం లక్నోలో 65 అడుగుల ఎత్తయిన శ్యామప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయిల కాంస్య విగ్రహాలను, 98,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో తామర పుష్పాకృతిలో నిర్మించిన అత్యాధునిక మ్యూజియంను ప్రధాని మోదీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. విపక్ష కాంగ్రెస్‌పై విమర్శలతో విరుచుకు పడ్డారు. "బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సుపరిపాలనకు కొత్త నిర్వచనం ఇచ్చింది. ఇప్పుడా సుపరిపాలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో సమున్నత శిఖరాలకు చేరింది. అయితే స్వాతంత్ర్యం తర్వాత దేశంలో ఎక్కడ అభివృద్ధి జరిగినా, మంచి పనులు పూర్తియినా కేవలం ఒకే ఒక్క కుటుంబం కారణంగా అవన్నీ జరిగాయనే భ్రమలు కల్పించారు. పాఠ్యపుస్తకాలు కావొచ్చు, ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వరంగ సంస్థలు, వీధులు, రోడ్డు, కూడళ్లు.. అన్నింటికీ ఆ ఒకే ఒక్క కుటుంబం పేర్లు పెట్టేశారు. వాళ్ల విగ్రహాలే నెలకొల్పారు. ఇదే ఆనాటి నుంచి అలాగే కొనసాగింది. ఈ కుటుంబ బంధనాల నుంచి భారత్‌ను బీజేపీ విముక్తం చేసింది. దేశం కోసం ప్రాణత్యాగాలకు సైతం సిద్ధపడిన ప్రతి ఒక్క భరతమాత బిడ్డను బీజేపీ నేడు సమున్నత స్థాయిలో గౌరవిస్తోంది. వీటికి కొన్ని ఉదాహరణలూ చెప్తా. నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఢిల్లీలో కీలక కర్తవ్యపథంలో ప్రతిష్ఠించాం. నేతాజీ త్రివర్ణ పతాకాన్ని ఎగరేసిన అండమాన్ నికోబార్ దీవుల్లోని ఒక దీవికి నేడు ఆయన పేరును పెట్టాం"అని మోదీ అన్నారు. "బాబా సాహెబ్ అంబేద్కర్ ఘనతను మరుగునపరిచే కుతంత్రాలను మీరంతా చూశారు. కాంగ్రెస్ రాజకుటుంబం ఢిల్లీలో ఎన్నో దారుణాలకు ఒడిగట్టింది. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ అదే పనిచేసింది. అంబేద్కర్ గొప్పతనాన్ని తగ్గించే కుట్రలను ఇప్పుడు బీజేపీ అడ్డుకుంటోంది. ఢిల్లీ నుంచి లండన్ దాకా అంబేద్కర్‌కు



సంబంధించిన ఐదు పుణ్యక్షేత్రాలను మేం అద్భుతంగా అభివృద్ధి చేశాం" అని మోదీ గుర్తుచేశారు. "బీజేపీని కాంగ్రెస్ ఎప్పుడూ అంటరాని పార్టీగా తప్పుడు ప్రచారంచేశాయి. కానీ బీజేపీ ఎల్లప్పుడూ అన్ని పార్టీలు, నేతలను గౌరవించింది. పీవీ నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీలకు మేమే భారతరత్న ఇచ్చాం. ములాయం సింగ్ యాదవ్, తరుణ్ గొగోయ్ ఇలా ఎందర్నో గౌరవించాం. ఇలాంటి మర్యాదలను కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల నుంచి ఎన్నడూ ఆశించలేం. వాళ్ల హయాంలో బీజేపీ దారుణ అవమానాలను ఎదుర్కొంది"అని మోదీ అన్నారు.

### ఈ స్మారకం దేశ ఆత్మగౌరవానికి తార్కాణం

"రాష్ట్రీయ ప్రేరణ స్థల్ జాతీయ స్మారకం.. దేశం చూపిన ఆత్మగౌరవ, సమగ్రత, సేవా మార్గానికి నిదర్శనం. డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీన్‌దయాళ్, వాజ్‌పేయిల నిలువెత్తు విగ్రహాలు మనకు సమున్నత స్ఫూర్తినిస్తున్నాయి. మనసావాచా ప్రజాసంక్షేమం కోసం పాటుపడాలని, ఆ ప్రయత్నంలో వందల సార్లయినా త్యాగాగ్నిలో కాలిపోయినా ఫర్వాలేదని గతంలో వాజ్‌పేయి అన్నారు. ఇప్పుడీ ప్రేరణ స్థల్ సైతం అదే సందేశం ఇస్తోంది. మన ప్రతి అడుగు దేశ నిర్మాణానికి ఉపయోగపడాలి. అభివృద్ధి చెందిన భారత్‌గా దేశం మారాలంటే ప్రతి ఒక్కరూ ఆ దిశగా సంకల్పించాలి. నూతన జాతీయస్మారకం ద్వారా ఆధునిక స్ఫూర్తిస్థల్‌కు చిరునామాగా నిలిచిన యూపీకి శుభాకాంక్షలు. ఇప్పుడీ ప్రేరణ స్థల్ నిర్మించిన 30 ఎకరాల ప్రాంతంలో గతంలో దశాబ్దాలపాటు భారీ చెత్తకుప్పలుండేవి. వాటిని పూర్తిగా తొలగించి అధునాతన నేషనల్ మెమోరియల్ కాంప్లెక్స్‌ను సాకారంచేసిన కార్మికులు, కళాకారులు, ప్రణాళిక కర్తలు, సీఎం యోగిజీకి నా మనస్ఫూర్తిగా అభినందనలు"అని మోదీ అన్నారు.

## తెలంగాణ బీజేపీ మరో కీలక నిర్ణయం

- నీటి ప్రాజెక్టులపై అధ్యయనం కోసం ప్రత్యేక కమిటీ
- ప్రాజెక్టులను సందర్శించనున్న కమిటీ సభ్యులు
- అసెంబ్లీలో నీటి కేటాయింపులపై చర్చకు సిద్ధమని ప్రకటన

**హైదరాబాద్, డిసెంబర్ 25 :** తెలంగాణ బీజేపీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో నీటి ప్రాజెక్టులపై అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక కమిటీ వేసి ప్రాజెక్టులను సందర్శించనున్నారు టీబీజేపీ నేతలు. తెలంగాణ అసెంబ్లీలో నీటి కేటాయింపులపై చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కేంద్ర ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై కమలం పార్టీ నేతలు షాకింగ్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి సెంటిమెంట్ రాజకీయాలు చేస్తున్నారని కాషాయ పార్టీ నేతలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటీపీ రాజకీయాలు తెలంగాణలో చెల్లదంటూ స్పష్టం చేశారు. చేసిన తప్పు కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్ కేంద్ర ప్రభుత్వంపై నెపం పెడుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో కృష్ణా జలాల్లో 299 టీఎంసీల నీటి కోసం ఒప్పుదం చేసింది ఎవరనీ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు కమలం పార్టీ నేతలు. తెలంగాణకు నీటి వాటాలో అన్యాయం చేసింది కేసీఆరేనని ఆరోపిస్తున్నారు. ఇన్నాళ్లు ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్ ఇప్పుడు బయటకు వచ్చి ఓటీపీ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఇప్పుడు తెలంగాణకు సరైన నీటి వాటా తీసుకురావడంలో విఫలం అవుతోందని మండిపడ్డారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా గతంలో కృష్ణా నీటిని తరలించుకు పోతుంటే కాంగ్రెస్ నేతలు ఎందుకు నోరు



మెదపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో కూడా ఇదే అంశంపై తమ వాదనను బలంగా వినిపిస్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. ఇప్పటికే నీటి వాటాలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చామని బీజేపీ నేతలు ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో తెలంగాణకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అన్యాయంపై సమగ్ర సమాచారం అందిస్తామని బీజేపీ నేతలు హెచ్చరించారు.

## గొంతుకోసి యువకుడి హత్య

**హైదరాబాద్, డిసెంబర్ 25 :** నగర శివార్లలో ఓ యువకుడి దారుణ హత్య కలకలం రేపుతోంది. గుర్తు తెలియని దుండగులు యువకుడి గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కవేలిగూడ వద్ద, మొయినాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మహేష్(26) అనే యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి దారుణంగా హతమార్చారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు దారితీసిందని తెలుస్తుండగా.. దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## సైదాపూర్ మండలంలో పరువు హత్య

**కరీంనగర్, డిసెంబర్ 25 :** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో పరువు హత్య కలకలం సృష్టించింది. కేసు వివరాలను హుజూరాబాద్ ఏసీపీ మీడియా సమావేశంలో వెల్లడించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇటీవల చనిపోయింది. కడుపునొప్పి తాళలేక బాలిక ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లిదండ్రులు ఈనెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఇది పరువు హత్యగా తేల్చారు. బాలిక అదే గ్రామానికి చెందిన ఓ యువకుడిని ప్రేమించడాన్ని ఆమె తల్లిదండ్రులు తట్టుకోలేకపోయారు. బలవంతంగా పురుగుల మందు తాగించి, గొంతునులిమి హతమార్చారు. బాలిక తల్లిదండ్రులను అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

## యాదాద్రిలో గోదాదేవి ఉత్సవాలు

**యాదగిరిగుట్ట, డిసెంబర్ 25 :** ప్రముఖ వైష్ణవ క్షేత్రం యాదగిరిగుట్టలో తిరుప్పావై ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. గురువారం గోదాదేవి చేపట్టిన వ్రత పర్వాన్ని పూజారులు నిర్వహించారు. పదో పాశుర పఠనంతో కొనసాగిన ధనుర్మాస వేడుకల్లో ప్రధాన పూజారి పాశుర విశిష్టతను వివరించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో తీర్చిదిద్ది పూజించారు. వేకువజామున కొనసాగిన ఈ వేడుకల్లో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హారతి నివేదన జరిపారు. ప్రధాన ఆలయంలో నిత్య కైంకర్యాల్లో భాగంగా శ్రీ సుదర్శన నరసింహ హోమం, శ్రీ లక్ష్మీ నరసింహ కల్యాణోత్సవం పర్వాలను పాంచరాత్ర ఆగమ శాస్త్ర రీత్యా కొనసాగించారు. ఆలయ మహా ముఖమండపంలో అష్టోత్తర పర్వం కొనసాగింది.

## నేడు ముఖ్యమంత్రి ప్రజావాణి రద్దు

**హైదరాబాద్, డిసెంబర్ 25:** బాక్సింగ్ డే నేపథ్యంలో హైదరాబాద్ నగరం బేగంపేటలోని ప్రజాభవన్‌లో 26వ తేదీన(శుక్రవారం) నిర్వహించాల్సిన ముఖ్యమంత్రి ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు నోడల్ అధికారి దివ్య దేవరాజన్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 30వ తేదీన (మంగళవారం) సీఎం ప్రజావాణిని నిర్వహిస్తామని, వినతులు సమర్పించేందుకు రావాలనుకున్న వాళ్లంతా గమనించాలని కోరారు.

## 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్' బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టాలి

**హైదరాబాద్:** తెలంగాణ వైద్య విధాన పరిషత్తు(టీవీవీపీ)ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్(డీఎస్‌హెచ్ఎస్) పరిధిలోకి తీసుకొచ్చేలా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం గురువారం డిమాండ్ చేసింది. రెండు సంవత్సరాలుగా 'టీవీవీపీ' పరిధిలో పనిచేస్తున్న వైద్యులకు జీతాలు సక్రమంగా రాక ఇబ్బంది పడుతున్నారని, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ పరిధిలోకి టీవీవీపీని తీసుకురావడమే జీతాల సమస్యకు శాశ్వత పరిష్కారమని పేర్కొంది. ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని సంఘం డిమాండ్ చేసింది. బాపనలపల్లి నరహరి, లాలు ప్రసాద్ రాథోడ్, ఎం.కె.రౌఫ్ తదితరులు ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.

## వైద్యవిద్య పీజీ రెండో విడత కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్

**హైదరాబాద్:** వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు కన్వీనర్ కోటా కింద రెండో విడత వెబ్ కౌన్సెలింగ్‌కు కాళోజీ వర్సిటీ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫైనల్ మెరిట్ జాబితాలో పేర్లున్న అభ్యర్థులు.. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, నిమ్స్‌లో ప్రవేశాలకు ఈ నెల 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లను పెట్టుకోవచ్చని వర్సిటీ గురువారం వెల్లడించింది.

## ప్రధాని సదస్సుకు సీఎస్

**హైదరాబాద్:** ప్రధాని మోదీ అధ్యక్షతన 26 నుంచి 28 వరకు జరిగే ప్రభుత్వ కార్యదర్శుల జాతీయ సదస్సు, ఉన్నతస్థాయి సమీక్షలో పాల్గొనేందుకు సీఎస్ రామకృష్ణారావు గురువారం ఢిల్లీ వెళ్లారు. మూడ్రోజుల పాటు పరిపాలన, అభివృద్ధి కేంద్రంగా రాష్ట్రాల సీఎస్‌లతో సదస్సు ఉంటుంది. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు కేంద్ర, రాష్ట్ర సంబంధాల బలోపేతం, పరిపాలన సంస్కరణలు, అభివృద్ధిపై చర్చ జరగనుంది. 'వికసిత్ భారత్ కోసం మానవ వనరులు' థీమ్‌తో ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక పథకాలకు.. సీఎస్ కేంద్ర నిధులను కోరే అవకాశముంది.



## క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 25 :** ఢిల్లీలోని కెథెడ్రల్ చర్చ్ ఆఫ్ రిడెంప్షన్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. . ఈ సందర్భంగా కొందరు క్రైస్తవులతో కలిసి ఆయన ప్రార్థనలు చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలను మోదీ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. దీనికి ముందు ఆయన ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యేసుక్రీస్తు బోధనలు సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఇక, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు సందేశం బలమైన సమాజాన్ని నిర్మిస్తోందన్నారు. యేసుక్రీస్తు బోధనలు శాశ్వత శాంతిని నెలకొల్పడంతో పాటు మానవుల మధ్య బంధాలను బలోపేతం చేస్తాయన్నారు.

## ఇంటి పిల్లర్లకు నీళ్లు కొడుతుండగా విద్యుత్ షాక్

### తండ్రీకొడుకుల దుర్మరణం

**నల్లగొండ, డిసెంబర్ 25 :** కొత్తగా నిర్మిస్తున్న ఇంటి పిల్లర్లకు నీళ్లు కొడుతుండగా విద్యుత్ షాక్‌కు గురై తండ్రి, కొడుకు మృతి చెందిన ఘటన చివ్వెంల మండల కేంద్రంలో విషాదం నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని 7జీ కాలనీలో నివాసం ఉంటున్న మాదాసు బుచ్చయ్య (48) సొంత పైసలతో కొత్త ఇల్లు కట్టుకుంటున్నాడు. ఇంటి నిర్మాణానికి బుధవారం మట్టి తరలింపు పనులు చేపట్టారు. గురువారం సాయంత్రం పిల్లర్లకు నీళ్లు కొట్టేందుకు ట్రాక్టర్ ట్యాంకర్‌లో మోటర్ వేసి, నీళ్లు కొడుతుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో బుచ్చయ్య కుప్పకూలాడు. కొద్దిసేపటికి అక్కడికి వచ్చిన చిన్న కుమారుడు మాదాసు లోకేష్ (22) సైతం ట్యాంకర్‌ను తాకడంతో అతడూ విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి తండ్రీకొడుకులను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ బుచ్చయ్య, లోకేష్‌ను పరిశీలించిన వైద్యులు వారిద్దరు అప్పటికే ఇద్దరూ మృతి చెందారని చెప్పారు. తండ్రీకొడుకు ఒక్కసారే మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

## తెలంగాణలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రియాంక, రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా అనురాగ్ జయంతి, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్‌గా ఎన్. రవి కిరణ్, శంషాబాద్ జోనల్ కమిషనర్‌గా కె.చంద్రకళ, ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్‌గా హేమంత్ కేశవ్ పాటిల్, మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్‌గా సంచిత్ గంగ్వార్, ఉప్పల్ జోన్ కమిషనర్‌గా రాధికా గుప్తాను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ సిరిసిల్ల కలెక్టర్‌గా గరిమా అగర్వాల్ కొనసాగుతారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా ఇ.వి. నర్సింహారెడ్డిని ప్రభుత్వం నియమించింది.

# తెలుగు రాష్ట్రాల్లో క్రిస్మస్ శోభ

- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు
- మెదక్ చర్చికి వేలాదిగా భక్తుల రాక
- హైదరాబాద్ చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు
- విజయవాడలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు
- పులివెందుల చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న జగన్, కుటుంబ సభ్యులు






**హైదరాబాద్/విజయవాడ, డిసెంబరు25 :** క్రిస్మస్ వేడుకలను తెలుగు రాష్ట్రాల్లోని క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పలు చర్చిల్లో క్రిస్మస్ ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో మొదలయ్యాయి. ఏసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని చర్చి పరిసర ప్రాంతమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. క్రిస్మస్ వేడుకల ప్రారంభ సూచకంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి చుట్టూ శిలువ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. శిలువను ముందు ఉంచి క్రైస్తవులు ప్రార్థనా గీతాలు ఆలపిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ ఊరేగింపు సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని చర్చి ప్రాంగణాలు ఆధ్యాత్మిక సందేశాలతో మార్మోగాయి. 'శాంతి, ప్రేమ, సోదరభావం' అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ కార్యక్రమం సాగింది. క్రిస్మస్ వేడుకల ప్రారంభ ఆరాధనకు తెలుగు రాష్ట్రాల్లోని పలు చర్చిలకు క్రైస్తవులు భారీగా తరలివచ్చారు. పులివెందుల చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో వైఎస్ జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సతీమణి భారతి, తల్లి విజయమ్మ ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే మెదక్ చర్చిలో ఏటా ప్రత్యేక ప్రార్థనలు జరుగతాయి. గురువారం ఉదయం నిర్వహించిన మొదటి ఆరాధనకు చర్చి ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. చర్చి ప్రాంగణమంతా కిక్కిరిసి పోవడంతో బయట ప్రాంగణంలో కూడా భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇందుకు అనుగుణంగా చర్చిల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. చర్చి ప్రాంగణాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అద్భుతంగా అలంకరించారు. చర్చి ప్రధాన ద్వారాలను విద్యుత్ కాంతులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చర్చిల ప్రాంగణాలు విద్యుత్ దీపాలతో మెరిసిపోతూ భక్తులను ఆకట్టుకున్నాయి. మెదక్‌లోని ప్రసిద్ధ సీఎస్ఐ చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. చర్చి చుట్టూ శిలువ ఊరేగింపు, ప్రత్యేక ప్రార్థనలతో వేడుకలు ఆరంభించారు. మొదటి ఆరాధనకు భక్తులు భారీగా పాల్గొన్నారు. దైవ సందేశాన్ని ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబిన్ మార్క్ వినిపించారు. ఆయన ప్రసంగంలో ఏసు క్రీస్తు జన్మ వెనుక ఉన్న అసలు సందేశాన్ని వివరించారు. ప్రేమ, క్షమ, త్యాగం, మానవత్వం వంటి విలువలు ఈ ప్రపంచానికి ఎంత అవసరమో ఆయన తన ఉపన్యాసంలో స్పష్టంగా చెప్పారు. సమాజంలో పెరుగుతున్న ద్వేషం, అసహనం మధ్య క్రిస్మస్ పండుగ మనకు శాంతి మార్గాన్ని చూపుతుందని ఆయన పేర్కొన్నారు. ఇకపోతే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేడుకలు వైభవంగా సాగాయి. విజయవాడ గుణదల మేరీమాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ రంగు రంగుల విద్యుత్ కాంతులతో చర్చి ప్రాంగణం శోభాయమానంగా ఉంది. క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవులు భారీగా తరలివచ్చారు. చర్చిలన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించి, ప్రత్యేక ప్రార్థనలతో సందడిగా మారాయి. ఈ వేడుకలు జిల్లాలో శాంతి, సంతోష వాతావరణాన్ని తీసుకువస్తాయని క్రైస్తవులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చర్చి లోపల కూడా ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఏసు క్రీస్తు జన్మ ఘట్టాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక ఏర్పాటు చేశారు. పండుగ వాతావరణంలో పిల్లల సందడి చర్చికి మరింత శోభను తీసుకువచ్చింది. పేదలకు ఆహార పంపిణీ, అవసరమైన వారికి సహాయం వంటి సేవా కార్యక్రమాలను కూడా చర్చి ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. సికింద్రాబాద్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. భారీగా క్రైస్తవులు తరలి రావడంతో భద్రతా ఏర్పాట్లను కూడా కట్టుదిట్టం చేశారు. చర్చి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్వచ్ఛంద సేవకులు సహాయం అందించారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. సిటీలోని పలు చారిత్రాత్మక చర్చిలలో క్రిస్టియన్స్ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. క్రైస్తవుల రాకతో మియపూర్ కల్వరి టెంపుల్ కిటకిటలాడింది. కల్వరి టెంపుల్‌లో ఈ ఒక్కరోజే 5 లక్షల మందికి పైగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. సికింద్రాబాద్, అబిడ్స్‌లోని చారిత్రాత్మక చర్చిలలో తెల్లవారుజాము నుంచే క్రిస్మస్ సందడి నెలకొంది. మంచిర్యాల జిల్లాలోని మందమర్రి, రామకృష్ణపూర్ సీఎస్ఐ, సీయోను, పెంతేకొస్తు చర్చిలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రైస్తవులందరికీ క్రిస్టమస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



## పరిపాలనా దక్షత.. ఉన్నత విలువలు
## అవే వాజ్‌పేయ్ ఉన్నత భావాలు

**101 జయంతి సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నివాళి**

**హైదరాబాద్, డిసెంబర్ 25 :** దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి మంచి వక్త, మంచి పరిపాలనా దక్షుడు, విలువలు కలిగిన మహా నేత అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కొనియాడారు. అటల్ జీ 101వ జన్మదినం సందర్భంగా దేశమంతా ఉత్సవాలు కార్యక్రమాలు జరుపుకుంటున్నామని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ప్రధాని , భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కేంద్రమంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఒక్క ఓటు తేడా ఉంటే నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా చేసి ప్రధాని పదవిని తృణ ప్రాయంగా వదులుకున్న మహోన్నతమైన నేత అటల్ జీ అని అన్నారు. భారతదేశ రక్షణ కోసం ఎంతో కృషి చేసి సుపరిపాలన అందించిన నేత అని తెలిపారు. సర్వ శిక్ష అభియాన్ పేరుతో విద్యాలయాల్లో మౌళిక వసతులు ఏర్పాటు చేశారని చెప్పారు.. పేద ప్రజల పక్షాన నిలిచి వారి అభ్యుదయం కోసం అనేక సంస్కరణలు తీసుకోచ్చిన నేత అటల్ అని అన్నారు. ఆయన ప్రసంగాలు, వ్యక్తిత్వం దేశ యువతకు మార్గదర్శిగా నిలిచాయన్నారు. పాకిస్థాన్ వెన్నుపోటు పొడిస్తే తిరిగి పాక్‌కు మూడు చెరువుల నీళ్ళు తాగించి పాక్‌ను మట్టికరిపించిన ఘనత అటల్‌కు దక్కుతుందని చెప్పుకొచ్చారు. ఒక దేశం నుండి మరొక దేశానికి.. ఢిల్లీ నుంచి లాహోర్‌కు బస్‌లో వెళ్లిన మొదటి ప్రధాని మోదీ అని తెలిపారు. స్వర్ణ చతుర్భుజి పేరుతో దేశ వ్యాప్తంగా రోడ్ల విస్తరణ చేసిన ఘనత ఆయనది అని అన్నారు. దేశ ప్రగతిలో తనదైన ముద్ర వేసుకున్న మహానుభావుడన్నారు. దేశ యువతకు అటల్ జీ జీవితం ఒక స్ఫూర్తి అనితెలిపారు. నేడు వాజ్‌పేయికు యావత్ దేశం ఘనంగా నివాళి అర్పిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ

**నిశాంత్‌రావు ఆర్థిక లావాదేవీలపై ఆరా**

**హైదరాబాద్, డిసెంబర్ 25 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ కొనసాగుతోంది. రాధాకిషన్‌రావు, తిరుపతన్న, శ్రవణ్‌రావును సిట్ అధికారులు విచారిస్తున్నారు. రెండ్రోజుల క్రితమే ప్రణీత్‌రావు, ప్రభాకర్‌రావును కలిపి విచారించిన అధికారులు.. ప్రభాకర్‌రావు కుమారుడు నిశాంత్‌రావు ఆర్థిక లావాదేవీలపై కూడా ప్రశ్నించారు. ప్రభాకర్‌రావు కస్టోడియల్ విచారణ ముగియనుండటంతో ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దక్కన్ కిచెన్ యజమాని నందకుమార్‌ను కూడా సిట్ విచారించింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నందకుమార్ గతంలో అరెస్టయ్యారు. ఫోన్‌ట్యాపింగ్ కారణంగా ఎమ్మెల్యేల కొనుగోలు అంశం తెరపైకి వచ్చింది. దీంతో నందకుమార్ వాంగ్మూలాన్ని సిట్ రికార్డు చేసింది.




## రేవంత్ మాటలతో సిఎం కుర్చీ పరువు పోతోంది

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్**

**హైదరాబాద్, డిసెంబర్ 25 :** విలువలతో కూడిన రాజకీయాలు చెయ్యాలి. అలాంటి విలువలు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో లేవని.. రేవంత్ రెడ్డి బూతులతో పోటీపడుతున్నాడని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి మాటలు చూస్తుంటే ముఖ్యమంత్రి కుర్చీ పరువు పోతుంది. రేవంత్ రెడ్డిలా మేము బూతులు మాట్లాడవచ్చు. కేసీఆర్ మాకు సంస్కారం నేర్పించారు. రియల్ ఎస్టేట్ రంగంలోమొత్తం బ్రోకర్ దందా జరుగుతుంది. కృష్ణా, గోదావరి జలాలను ఆంధ్రా ప్రాంతానికి తరలించుకొని పోతుంటే, జరుగుతున్న అన్యాయం పైన కేసీఆర్ మాట్లాడారు. కృష్ణార్జునులు అయిన కేటీఆర్, హరీష్ రావులనే కాంగ్రెస్ నాయకులు తట్టుకోలేక పోతున్నారు. రేవంత్ రెడ్డి తీరు మార్చుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ హయాంలో తెలంగాణను అభివృద్ధి చేసి చూపించాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అభివృద్ధి కుంటుపడింది. నల్లమల బిడ్డను అని చెప్పుకునే రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి అయిన తరువాత పాలమూరు జిల్లాకు ఏం చేశావో సమాధానం చెప్పు అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కాబోతున్నాడు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో చివరి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసి పెట్టుకోండి. జేజమ్మ దిగి వచ్చిన బీఆర్ఎస్ పార్టీనీ ఏం చెయ్యలేరని ధీమా వ్యక్తం చేశారు.

## నల్గొండ జిల్లా బీజేపీలో భగ్గుమన్న విభేదాలు

- సర్పంచ్‌లకు సన్మానం విషయంలో వివాదం
- పరస్పరం దాడులకు తెగించిన ఇరు వర్గాలు

**నల్గొండ, డిసెంబర్ 25 :** నల్గొండ జిల్లాలో బీజేపీ లో విభేదాలు భగ్గుమన్నాయి. రెండు వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. జిల్లాలో పార్టీ తరఫున గెలిచిన 17 మంది సర్పంచ్‌లకు సన్మానం చేసే విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో బీజేపీ నేత పిల్లి రామరాజుపై ఓ వర్గం దాడి చేసింది. దాంతో జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డిపై మరో వర్గం దాడికి పాల్పడింది. ఈ ఘర్షణ గురించి తెలిసి బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అదేవిధంగా పోలీసులు కూడా అక్కడ భారీగా మోహరించారు. మరోవైపు ఈ కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్ల కెమెరాలను కొందరు నేతలు లాక్కుని డేటాను డిలీట్ చేశారు. అందుకు నిరసనగా జర్నలిస్టులు బీజేపీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ క్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు క్షమాపణ చెప్పడంతో జర్నలిస్టులు ఆందోళన విరమించారు.

## గ్రేటర్‌లో విలీనాలు.. హైకోర్టు నోటీసులు




**హైదరాబాద్, డిసెంబర్ 25 :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చట్ట సవరణకు సంబంధించిన వివాదంలో తెలంగాణ హైకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పలు మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీన చేయడానికి జారీ చేసిన ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టి హైకోర్టు.. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. పిటీషన్‌లో ప్రధానంగా తుక్కుగూడ మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో విలీనం చేయడాన్ని సవాల్ చేస్తూ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. పిటీషనర్ అభిప్రాయాలు తీసుకోకుండా మ-రుసటి చర్యలు తీసుకున్నారన్నది ప్రధాన వాదన. దీనిపై ప్రభుత్వం తరఫున కౌంటర్‌ను దాఖలు చేయాలంటూ హైకోర్టు ఆదేశించింది.

## ఢాకాలో హిందువులపై ఆగని దాడులు

**మరో హిందూ యువకుడి దారుణ హత్య**

**ఢాకా, డిసెంబర్ 25 :** బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయి. హిందూ మైనారిటీలే లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయి. దీపూ చంద్ర దాస్ ఉదంతం మరవకముందే మరో హిందూ వ్యక్తిని గ్రామస్థులు కొట్టి చంపిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. రాజ్‌బరి జిల్లాలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుందని స్థానిక మీడియా పేర్కొంది. డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆపిస్తూ.. గ్రామస్థులు అతడిపై దాడికి పాల్పడినట్లు స్థానిక పోలీసులు పేర్కొన్నారు. రాజ్‌బర్ జిల్లా పంగ్షా సర్కిల్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. అమృత్ మొండల్ (29) అలియాస్ సామ్రాట్‌పై బుధవారం రాత్రి గ్రామస్థులు దాడి చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న సామ్రాట్‌ను స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం వేకువజామున 2 గంటల సమయంలో మృతిచెందాడు. సామ్రాట్ అనుచరుల్లో ఒకడైన మొహ్మద్ సెలిమ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి ఒక పిస్టల్, షూటర్ గన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. షేక్ హసీనా దేశం వీడిన తర్వాత సామ్రాట్ కొద్ది రోజులు అజ్ఞాతం గడిపాడని, ఇటీవలే గ్రామానికి తిరిగి చేరుకున్నాడని వెల్లడించారు. దీపూ చంద్రదాస్‌పై దాడి తర్వాత ఓ మైనారిటీ వ్యక్తిపై మూకదాడి జరగడం ఈ ఘటనపై అనుమానాలకు తావిస్తోంది.

## అక్రమ ఇసుక దందా చేస్తే కఠిన చర్యలు

**మంత్రి వివేక్ వెంకటస్వామి హెచ్చరిక**

**మంచిర్యాల, డిసెంబర్ 25 :** అక్రమంగా ఇసుక దందా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ వెంకటస్వామి హెచ్చరించారు. గురువారం ఆయన చెన్నూరు నియోజకవర్గంలో పర్యటించారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పలు చర్చిలలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. అనంతరం చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మంచి మద్దతు ఇచ్చారని అన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో దాదాపు అన్ని స్థానాలను కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులు గెలిచారన్నారు. కొన్ని చోట్ల డబ్బు ఆశ చూపి పదవులు దక్కించుకున్నారని విమర్శించారు. ఇసుక దందా చేసి అక్రమంగా సంపాదించిన డబ్బులతో కొందరు పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందారని.. వాళ్లది అసలు గెలుపే కాదని అన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు బయటి వాళ్లకు సహకరించారని.. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు.

## రేవంత్ రెడ్డి భాష మార్చుకో

- లేకుంటే ప్రజలే నిన్ను మార్చేస్తారు
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హితవు



**హైదరాబాద్, డిసెంబర్ 25 :** సిఎం రేవంత్ రెడ్డి భాష మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హితవు పలికారు. బూతుల పురాణం మాట్లాడడమే సరిపోతుందని, కేసీఆర్ ప్రెస్ మీట్ పెట్టగానే రేవంత్ రెడ్డికి లాగు తడిచి పోయిందన్నారు.. అందుకే నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డికి దమ్ము ఉంటే వైన్స్ లు బంద్ చేయాలి. రేవంత్ రెడ్డి ఇంట్లో ఉండే బంధువులు మందు తాగడం లేదా అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ ఉన్నంత కాలం దేశంలో కాంగ్రెస్ పార్టీ ఖతం కావడం ఖాయం అన్నారు. రేవంత్ రెడ్డి ఉన్నంత కాలం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఖతం అవుతుందన్నరు. కేటీఆర్ కంటే అందగాడివా..? నువ్వు రేవంత్ రెడ్డీ... మేకపోతులా ఉండే నువ్వు కేటీఆర్ అందం గురించా మాట్లాడేది..? అని ప్రశ్నించారు. హరీష్ రావు ఆరడుగుల బుల్లెట్, హరీష్ రావు గురించా నువ్వు మాట్లాడేది. తెలంగాణ బాపు కేసీఆర్‌ను పట్టుకొని నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నావు. కేటీఆర్‌ను పట్టుకొని నీ అవ్వా అని మాట్లాడతవా. బూతులు తిట్టే వాడు మా ఊర్లో ఒకడు ఉన్నడు, వాడికి నీకు పోటీ పెడతాం. రేవంత్ రెడ్డి భాష చూస్తుంటే సొంత మనవడే భయపడేలా ఉన్నాడని చిరుమర్తి అన్నారు. పిట్టలదొర కంటే హీనంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడు. కేసీఆర్‌కు నాలుగున్నర కోట్ల మంది దీవెనలు ఉన్నాయని గుర్తుంచుకో అంటూ హెచ్చరించారు.

## విద్యార్థులకు తిండిపెట్టలేని స్థితిలో ప్రభుత్వం


**మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం**



**సిద్దిపేట, డిసెంబర్ 25 :** అనాథ విద్యార్థులకు తిండిపెట్టలేని స్థితిలో ఈ దరిద్రపుగొట్టు ప్రభుత్వం ఉన్నదని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీశ్‌రావు మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా సిద్ధిపేటలో ఆనాథ విద్యార్థులతో మాట్లాడేందుకు హరీశ్‌రావు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంపై విమర్శలు వర్షం గుప్పించారు. గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల విద్యార్థుల మెస్ బిల్లులు, కాస్మటిక్ చార్జీలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. రేవంత్ సర్కారు కమిషన్‌ల సర్కారు అని, కమిషన్‌లు లేకుండా ఏ పనీ చేయడం లేదని ఆరోపించారు. విద్యార్థులు కమిషన్‌లు ఇచ్చుకోలేరు కాబట్టే మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు పెండింగ్‌లో పెట్టినట్టున్నరని ఎద్దేవా చేశారు. విద్యార్థులకు పెండింగ్లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలను వెంటనే చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సీఎం గ్రీన్ ఛానెల్ పెట్టి విద్యార్థులకు బిల్లులు ఇప్పిస్త అన్నడని, కానీ ఇంతవరకు బిల్లు ఇవ్వలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతయని, చేతలు మాత్రం గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. విద్యార్థులకు సకాలంలో బిల్లులు ఇవ్వకపోతే తోలు వలుస్తా, తోడ్కలు తీస్తా అని రేవంత్‌రెడ్డి గొప్పలు మాట్లాడిండని, అయినా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. 'నువ్వే ముఖ్యమంత్రివి, నువ్వే విద్యాశాఖ మంత్రివి.. అయినా మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నయ్. మరె ఇప్పుడు ఎవరి తోడ్కలు తియ్యాలె..?' అని ప్రశ్నించారు. చిల్లర మాటలు మాట్లాడుతూ విద్యార్థులకు సరిగా భోజనం పెట్టని సీఎం రేవంత్‌రెడ్డిని చెట్టుకు కట్టేసి, లాగులో తొండలు జొరగొట్టాలని హరీశ్‌రావు అన్నారు. రేవంత్‌రెడ్డి తోడ్కలు తీసే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు. కేసీఆర్ గంట ప్రెస్ మీట్ పెడితే.. సీఎంకు, కాంగ్రెస్ నేతలకు లాగులు తడుస్తున్నయని ఎద్దేవా చేశారు. రేవంత్ ప్రభుత్వ తీరుపై ప్రెస్‌మీట్‌లో కేసీఆర్ అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా రేవంత్‌రెడ్డి, ఆయన పార్టీ నేతలు సమాధానం చెప్పలేకపోయారని విమర్శించారు.

## నగరంలో విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్‌లు

**తాగి వాహనాలు నడపరాదని పోలీసుల హెచ్చరిక**



**హైదరాబాద్, డిసెంబర్ 25 :** నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు ప్రారంభించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. బుధవారం ప్రారంభమైన ఈ తనిఖీలు డిసెంబర్ 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి. వరుసగా రెండోరోజూ తనిఖీలు చేపట్టారు. ఓఆర్ఆర్‌పైనా తనిఖీలకు సిద్ధమయ్యారు. నగరంలో 120 ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు ఉంటాయని హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. బుధవారమే డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో 304 మందిని పట్టుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన 304 మంది వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో నగర వాసులకు పలు సూచనలు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా, పది వేల రూపాయల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం పబ్‌లకు వెళ్లే వారు తమ డ్రైవర్లను వెంట తీసుకెళ్లాలని కమిషనర్ తెలిపారు. లేదంటే క్యాబ్ బుక్ చేసుకుని ప్రయాణించాలని సూచించారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా సెలబ్రేషన్స్ చేసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# పరస్పర విమర్శలతో ఒరిగిందేమిటి?



**తెలంగాణ రాజకీయాలు గమ్మత్తుగా సాగుతున్నాయి. కెసిఆర్ విమర్శలు, సిఎం రేవంత్ ప్రతి విమర్శలు జుగుప్సాకరంగా ఉన్నాయి. పరస్పర విమర్శలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. రెండేళ్లు దాటినా కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతి విచారణలు, చర్యల్లో ఒక్క అడుగు కూడా పడలేదు. విచారణల పేరుతో కాలయాపన తప్ప మరోటి కానరావడం లేదు. ఏతావాతా రాజకీయ నాయకుల అవినీతిని పరస్పరం భరించే ఒప్పందాలు జరిగాయా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మొత్తానికి విభజన తరవాత తెలంగాణ దగా పడ్డదన్నది నిజం. అన్నింటికి మించి తెలంగాణ వ్యవహారాలను ప్రజలనుంచి దూరం చేసి మూడు పార్టీలు ఆటలాడుతున్నాయి.**

కాంగ్రెస్ మీద బిఆర్ఎస్, బిఆర్ఎస్ మీద కాంగ్రెస్, ఈ రెండింటిపై బిజెపిలు విమర్శలు చేసుకోవడం పరిపటిగా మారింది. ప్రజలకు మంచి చేద్దామన్న ఆలోచన ఒక్కరికీ లేదు. రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేసి, మళ్లీమళ్లీ అప్పులు చేస్తున్నారు. అవసరం లేని ఖర్చులనే ప్రస్తావిస్తున్నారు. రాజకీయంగా తామే బలంగా ఉండాలని, తామే పాలించాలన్న ఆలోచన తప్ప మరోటి కానరావడం లేదు. కెసిఆర్ హయాంలో జరిగిన అప్పుల గురించి కెసిఆర్ కూడా మాట్లాడడం లేదు. జరిగిన తప్పులు, అప్పులకు ఎవ్వరు కూడా బాధ్యత వహించడం లేదు. ఇదంతా ప్రజల ఖర్మకు వదిలేశారు. ఇకపోతే కెసిఆర్ తనయ ఇప్పుడు స్వతంత్రంగా రాజకీయాలు చేస్తున్నారు. బిఆర్ఎస్ బహిష్కరించాక ఆమెకు ఇప్పుడిప్పుడే జ్ఞానోదయం అవుతోంది. పదేళ్ల పాలనా కాలంలో తాను నిమిత్త మాత్రురాలినని అంటున్నారు. అన్నింటికి మంచి ఆమె ఎక్కడికి వెళ్లినా సమస్యలు స్వాగతిస్తున్నాయి. ఆమె ఇవన్నీ చూసి ఆశ్చర్యంతో పాటు క్షమాపణలు చెబుతున్నారు. తనతండ్రి పదేళ్ల కాలంలో బంగారు తెలంగాణ అన్నది జరగలేదని, గుర్తిస్తున్నందుకు ప్రజలకు కూడా తెలిసి వస్తోంది. పదేళ్ల పాలనో కెసిఆర్ తెలంగాణను ఆగం చేశారని, దోపిడీ చేశారని, ఎక్కడా అభివృద్ధి జరగలేదని కవిత పర్యటనల ద్వారా నిత్యం తెలుసుకుంటున్నాం.

ఆనాడు నాకు ఎలాంటి అధికారం లేదని, ఒక్క టీచర్‌ను కూడాబదిలీ చేయించుకునే అవకాశం రాలేదని వలపోస్తున్నారు. బీఆర్ఎస్ నేతలపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఆమె ఇప్పుడు ఒక సంచలన నాయకురాలిగా మారారు. అయితే ఆమె ఆరోపణలు, విమర్శలు తండ్రి పార్టీని మరింతగా దెబ్బతీస్తాయన్నది నిజం. అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారుతాయన్నది కూడా అంతే నిజం. కాళేశ్వరం నుంచి కూకట్‌పల్లి భూకబ్జాల దాకా తీవ్ర ఆరోపణలు చేస్తూ ఆమె ఒక సంచలన నాయకురాలిగా మారి పోయారు. బిఆర్ఎస్‌లో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేల భూదందాలు, అక్రమాలపై విరుచుకు పడుతున్న తీరుతో ఆమె ప్రజల్లో మళ్లీ కొంత సానుభూతిని పొందే ప్రయత్నాల్లో సాగుతున్నారు. అయితే లిక్కర్ స్కామ్‌తో కవిత పొలిటికల్ కెరీర్‌కు కాస్త ఇబ్బంది ఏర్పడింది. అప్పటికే కేసీఆర్ పదేండ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఇలా ఎవరికి వారు స్వార్థ రాజకీయాలకు తెలంగాణను బలి తీసుకున్నారు. అందుకేనేమో ఇప్పుడు కవిత వ్యాఖ్యలు సంచలనం కలిగిస్తున్నాయి. మొదటి నుంచి కూడా పార్టీలో తనకు ప్రాధాన్యమిచ్చేవారు కాదని కవిత చెపుతోంది. ఎంపీగా ఉన్నపుడు తనను నిజామాబాద్‌కు మాత్రమే పరిమితం చేశారని చెపుతోంది. నేటి కాలంలో వారసత్వాలు లేని రాజకీయాలు నడవడం లేదు. కెసిఆర్ కూడా అందుకు అతీతుడు కాదని నిరూపించుకున్నారు. బీజేపీ, కమ్యూనిస్టులు మాత్రమే ఇందుకు భిన్నంగా ఉంటారు. కిందిస్థాయిలో ఆ పార్టీ నేతల వారసలు కూడా ఇప్పుడిప్పుడు మెల్లగా బయటకు వస్తున్నారు. భారతదేశంలో ఏ పార్టీ వారసత్వ రాజకీయాలకు అతీతం కాదు. కాకపోతే, ఒకే కుటుంబంలో కొడుకు, కూతురు, మేనల్లుడిని ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకుని వచ్చారు. తన బందు గణాన్ని కూడా తెచ్చి పెట్టుకున్నారు. తన కులం వారికి అగ్ర తాంబూలంఇచ్చారు. ఎక్కడెక్కడో ఉన్న వారిని ముందువరసలో పెట్టారు. ఇలా మొత్తం ఒకే కులం వారు గత పదేళ్లపాటు డామినేషన్ చేశారు. ఇప్పుడు అదే దెబ్బకొట్టింది. అదే అధికారాన్ని దూరం చేసింది. చివరకు కెసిఆర్‌కు వారసుల నుంచే సమస్యలు ఎదురవుతున్నాయి.

కేసీఆర్ అడ్డదిడ్డంగా సంపాదించిన సంపదలో వాటా వివాదం కారణంగానే కవితను బయటకు పంపారని అంటున్నారు. సిఎం రేవంత్ రెడ్డి అయితే పదేపదే ఇదే చెబుతున్నారు. గత ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి తమ పార్టీవారే తనను కావాలని ఓడించారని ఇప్పుడు కవిత చెపుతోంది. మంచి వక్తగా పేరున్న కవిత బాగా సంపాదించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తనకేమీ తెలియదని ఇప్పుడు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆమెను దగ్గరగా చూసిన వారు మాత్రం నిజమేమిటో తెలుసుకోగలరు. లిక్కర్ కేసు ద్వారా ప్రతిష్ట దెబ్బతిన్నదన్నది నిజం. తిరిగి పరువు కాపాడుకోవాలనే ఆరాటం కవితలో బాగా కనిపిస్తోంది. అందుకే జాగృతి జనంబాట పట్టారు. రాజకీయాల్లో అపవాదుకు గురైనపుడు, కుటుంబం దూరం పెడుతున్నపుడు, తనకు మిగిలింది రాజకీయ మార్గమే అని కవిత భావించి ఉంటుంది. ఆమె చేపట్టిన తిరుగుబాటు రాజకీయం తండ్రి పార్టీని దెబ్బతీస్తుందని తెలిసినా , తన రాజకీయ ఎజెండా కోసం ఆమె దేనినీ లెక్క చేయడం లేదని కనిపిస్తోంది. కాళేశ్వరంలో జరిగిన అవినీతికి హరీశ్‌రావే కారణంగా ఆమె చేసిన విమర్శలు సంచలనంగా మారాయి. ఎవ్వరినీ వదలకుండా అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. తాను మాత్రం కడిగిన ముత్యం అని చెప్పుకునే ప్రయత్నం కూడా చేస్తున్నారు. కెసిఆర్ కూతురుగా రాజకీయాల్లోకి వచ్చిన కవిత ఇప్పుడు తనకుతానుగా రాజకీయంగా నిలదొక్కుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆమె ఏమేరకు విజయం సాధిస్తారన్న చూడాలి. అయితే తెలంగాణ వేదికగా రాజకీయ పార్టీలు విన్యాసం చేస్తున్నాయి. తెలంగాణ విడివడ్డ తరవాత కూడా పెద్దగా ఆశించిన ప్రయోజనం మాత్రం నెరవేరలేదు. రాజకీయాలు వారి సౌలభ్యం కోసం మారాయి. ప్రజలు మాత్రం పావులుగా మారారు. ఈ తరహా రాజకీయాలను దూరం చేయాలంటే ప్రజలు చైతన్యం కావాలి. దగుల్బాజీ రాజకీయాలను దునుమాడాలి.

# వేలకోట్లు సంపాదనలో ఆ ఇద్దరు మంత్రులు

- అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లక తప్పదు
- కొంతమంత్రి మంత్రులు భూ దందాలతో సంపాదన
- దీనిని తామే ఎప్పటికైనా బయటపెడతాం
- సిఎంగా రేవంత్ భాష పద్దతిగా లేదు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు



**హైదరాబాద్, డిసెంబర్ 25 :** రాష్ట్రంలో ఇద్దరు మంత్రులు వేల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు . వారిపై ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థల నిఘా ఉందన్నారు. ఎప్పటికైనా ఆ ఇద్దరు రాష్ట్రమంత్రులు జైలుకెళ్లడం ఖాయమని సంచలన కామెంట్స్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై కేంద్ర ప్రభుత్వం వద్ద అధారాలు ఉన్నాయన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొంతమంది మంత్రులు వేల కోట్ల భూములను అమ్ముకుంటున్నారని.. దీన్ని ఎప్పటికైనా బయటపెడతామని హెచ్చరించారు. ఇద్దరు లేదా ముగ్గురు మంత్రులు జైలుకెళ్లడం ఖాయమని ఆయన చెప్పారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేసీఆర్ మీద రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష సరైంది కాదన్నారు. ఇకపోతే ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు మాట్లాడే ముందు జాగ్రతగా ఉండాలని.. అంతేకానీ ఇలా దిగజారి మాట్లాడితే ఆ పదవికి ఉన్న గౌరవం తగ్గుతుందని బండి సంజయ్ హితవు పలికారు. మాజీ సీఎంపై రేవంత్ రెడ్డి వాడిన భాషమీదే తెలంగాణలో ప్రస్తుతం తీవ్ర చర్చ జరుగుతోందన్నారు. నీటి వాటాల అంశంలో తప్పు చేసిందే కేసీఆర్ అని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి , మాజీ సీఎం కేసీఆర్ లపై కేంద్రమంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అప్పుడు రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగిందని.. నీటి పంపకాల అంశంలో అప్పట్లో తాను చేసిన వ్యాఖ్యలను ఓ ఐఏఎస్ అధికారి ట్వీట్ చేశారని గుర్తుచేశారు. కృష్ణా జలాల అంశంలో కేసీఆర్ తప్పుడు నిర్ణయాల వల్లే ఇందంతా జరిగిందని విమర్శించారు. అనేకసార్లు అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ తప్పించుకున్నారన్నారు. కేసీఆర్‌ను రేవంత్ తిట్టడం వెనక సింపతీ పెంచే కుట్ర దాగుందని.. కానీ ఇందుకోసం మరీ ఇంత జుగుప్సాకరమైన భాష అవసరం లేదన్నారు. తెలంగాణాకు పట్టిన పెద్ద శని కేసీఆర్ కుటుంబమని బండి ధ్వజమెత్తారు. కేసీఆర్ శని కాబట్టే ప్రజలు ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశారని కామెంట్స్ చేశారు. కాళేశ్వరం స్కామ్ నుంచి తప్పించుకోవడానికే కేసీఆర్ కృష్ణా జలాల అంశాన్ని కొత్తగా తెరమీదకు తెచ్చారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం లాగే రేవంత్ రెడ్డి సర్కార్ కూడా పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. అప్పుడు పథకాల అమలుపై ప్రజలు నిలదీస్తారని కేసీఆర్ కొత్త అంశాలను తెరపైకి తెచ్చేవారని.. ఇప్పుడు రేవంత్ సైతం అదే డ్రామా ఆడుతున్నారని కేంద్రమంత్రి విమర్శించారు. కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు మాజీ సీఎం కేసీఆర్‌కు లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దృష్టి మళ్లించడానికి కృష్ణా జలాల అంశం కేసీఆర్ లేవనెత్తుతున్నారని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా తానే అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టించా అని చెప్పారు. ఇక కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని బండి సంజయ్ తప్పుబట్టారు. కేసీఆర్‌పై సీఎం రేవంత్ మాట్లాడిని భాష సరికాదన్నారు. సీఎం తన భాషపై పునరాలోచన చేయాలి. ప్రతీ వ్యక్తి సుఖ సంతోషాలతో ఉండాలని హిందూ ధర్మం కోరుకుంటుంది. కేసీఆర్ కుమారుడు అహంకారం తలకెకినట్టు మాట్లాడుతారు. గతంలో కేసీఆర్ మాట్లాడితే మేము ఖండించాం. సీఎం రేవంత్ మాట్లాడిన తీరు ఆయనకే నష్టం' అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 'తెలంగాణకు నంబర్ వన్ ద్రోహి కేసీఆర్. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ ఏమీ చేశారో ఆధారాలతో సహా బయట పెట్టింది ముందు నేనే. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకే ఒప్పందం చేసుకున్నారు. ముడుపుల కోసం 575 టీఎంసీలు అడగలేదు. కేసీఆర్‌కు కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు లేదు. అప్పుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా నేనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టించాను. కాళేశ్వరం స్కాం నుంచి దృష్టి మరల్చేందుకు కేసీఆర్ కృష్ణ జలాలు ఇష్యూ తెరపైకి తెస్తున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్, కేసీఆర్ మధ్య ఏం ఒప్పందం జరిగిందో చెప్పాలి. కేసీఆర్ కుటుంబమే తెలంగాణకు పెద్ద శని. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## సమైక్యాంధ్రలో మాదిరిగానే
# జల దోపిడీ పునరావృతం

- జలదోపిడీ జరుగుతున్న పట్టించుకోని ప్రభుత్వం
- మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి విమర్శలు



**సూర్యాపేట, డిసెంబర్ 25 :** సమైక్యాంధ్రలో మాదిరిగానే జల దోపిడీ మొదలైందని మాజీ మంత్రి గుంటకండ్ల జరగదీశ్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో విచిత్ర పరిస్థితి నెలకొందని, కృష్ణ గోదావరి నీళ్ల దోపిడికి గురవుతూ హక్కులకు భంగం వాటిలోతోందని అన్నారు. ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, అదేందని అడిగిన వారిపై ఎదురుదాడికి ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుభవం లేదని కేసీఆర్ ఏదైనా చెబితే పాజిటివ్‌గా తీసుకోకుండా ఎదురుదాడి చేస్తున్నారని జగదీశ్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ లక్ష మందితో సభపెడితే కృష్ణ జలాలపై శాసనసభలో తీర్మానం చేశారని చెప్పారు. బనకచర్లపై కూడా అంతే నిర్లక్ష్యంగా వ్యవహరిం చారని, ఎదిరించి ఉద్యమం చేపడతామంటే దిగి వచ్చారని అన్నారు. కృష్ణా నదికి చంద్రబాబు గండి కొట్టే ప్రయత్నం చేస్తున్నడని, ఇరిగేషన్ మంత్రి అవగాహన లోపంతో, తెలివి తక్కువ తనంతో 40 టీఎంసీలకు ఒప్పుకొని ఉత్తరం రాసిండని చెప్పారు. 90 టీఎంసీల నీటిని మహబూబ్‌నగర్ రంగారెడ్డిలకు అందించేందుకు గతంలో 27 వేల కోట్లు ఖర్చుపెట్టామని, మిగిలిన పది శాతం పనులు పూర్తి చేయకుండా 40 టీఎంసీలకు ఒప్పుకుని మహబూబ్‌నగర్ రంగారెడ్డి జిల్లాలకు అన్యాయం చేసిండ్రని జగదీశ్ రెడ్డి అన్నారు. కేసీఆర్ గంటపాటు నీళ్లపై జరుగుతున్న అన్యాయాన్ని వివరించాడని, ఎవరిపై విమర్శ చేయలేదని చెప్పారు. చంద్రబాబు, నరేంద్ర మోడీ రాష్ట్రాన్ని కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నరని ఆరోపించారు. మోడీ, చంద్రబాబులు రేవంత్‌రెడ్డి అవసరమని, ప్రజలకు అవసరం లేదని జగదీశ్‌రెడ్డి అన్నారు. మోదీ, చంద్రబాబుల కోసం ప్రజల గొంతు ఎండబెడతామంటే ఊరుకోమని హెచ్చరించారు. కేసీఆర్.. ప్రభుత్వం తోలు తీస్తా అన్నారని, స్ట్రీట్ ఫెలోస్ గురించి మాట్లాడలేదని వ్యాఖ్యానించారు. రేవంత్ గురించి తాము కూడా నోటికొచ్చినట్లు మాట్లాడగలమని, కానీ ఆ భాషను తాము మాట్లాడమని అన్నారు. రేవంత్ రెడ్డిది కంపు నోరని, మురికి కాలువ కంపు కంటే అధ్వాన్నమని విమర్శించారు. రేవంత్‌ది ఏ కోశాన కూడా కేసీఆర్ స్థాయి కాదని జగదీశ్‌రెడ్డి అన్నారు. రేవంత్ కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోడని, ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చే మాటలు మాట్లాడుతున్నడని విమర్శించారు. ముఖ్యమంత్రి సోయి తెచ్చుకొని మాట్లాడాలని, సాధారణ ఎన్నికలు వస్తే ప్రజలే రేవంత్ రెడ్డిని బండరాళ్లు కట్టి మున్సిపల్ చెత్త పారేసినట్లు మూసిలో పడవేస్తరని అన్నారు. కేసీఆర్‌కు సమాధానం చెప్పలేక బూతు మాటలు మాట్లాడుతుండని మండిపడ్డారు. కేసీఆర్ ప్రజల్లోకి వస్తుంటే భయం ఎందుకు..? దమ్ముంటే కేసీఆర్ ప్రశ్నకు సమాధానం చెప్పు అని సవాల్ చేశారు.నువ్వు, నీ పోలీసులు అధికారులతో ఎన్ని పన్నాగాలు పన్నినా టీఆర్ఎస్ సైనికులు అద్భుతమైన పోరాటంతో గెలుపొందారని జగదీశ్‌రెడ్డి అన్నారు. 'కేసీఆర్ నీ బండారం బయటపెడతాడని బూతులు మాట్లాడుతున్నవ్.. నువ్వు ఎంత దిగజారినా మేం ఆ స్థాయికి రాము' అని ఎద్దేవా చేశారు. దొంగ రాతలు రాస్తూ కుటుంబాలను ఇబ్బందులు పెడుతున్న మీకు ప్రజల చేతుల్లో శిక్ష పడుతుందని అన్నారు. రేవంత్‌రెడ్డీ కేసీఆర్ ముందు నీ కుప్పి గంతులు మానుకో అని హెచ్చరించారు.

## ప్రమాద బస్సు వెంటే
# మరో బస్సు

- ప్రమాద బస్సును స్వల్పంగా ఢీకొని పక్కకు జరిగిన బస్సు
- తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డ స్కూల్ విద్యార్థులు

**బెంగళూరు, డిసెంబర్ 25 :** కర్ణాటకలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పలు కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదం నుంచి 40 మందికి పైగా స్కూల్ విద్యార్థులు త్రుటిలో తప్పించు కున్నట్లు తాజాగా తెలిసింది. ఈ విషయాన్ని పోలీసు అధికారులు వెల్లడించారు. టి.దర్శహల్లి నుంచి దండేలికి వెళ్తున్న ఓ టూర్ బస్సు.. ప్రమాదానికి గురైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు సమాంతరంగా ప్రయాణించింది. ఈ టూర్ బస్సులో 42 మంది విద్యార్థులు ఉన్నారు. ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొనడంతో ఆ ప్రమాద ధాటికి స్కూల్ బస్సు కూడా అదుపు తప్పింది. ఈక్రమంలో స్కూల్ బస్సు ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సును వెనక నుంచి ఢీకొట్టి రోడ్డు పక్కకు జారింది. అయితే, పిల్లల బస్సుకు ఎలాంటి ప్రమాదం జరగలేదని ఐజీపీ రవికాంతేగౌడ వెల్లడించారు. విద్యార్థులను తీసుకెళున్న బస్సు డ్రైవర్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసినట్లు తెలిపారు. ఘటనపై బస్సు డ్రైవర్ మాట్లాడుతూ.. 'డివైడర్‌కు మరోవైపున ప్రయాణిస్తున్న లారీ ఒక్కసారిగా తాను వెళున్న రోడ్డు పైకి దూసుకొచ్చింది. లారీ ఢీకొట్టబోతోందని అర్థమై బస్సును కంట్రోల్ చేసేందుకు ప్రయత్నించా. కానీ అప్పటికే ప్రమాదం జరిగింది. ప్రమాదం ధాటికి మా బస్సు పక్కనే వెళ్తోన్న మరో వాహనాన్ని కూడా తాకింది. అయితే ఆ వాహనం ఏంటో నేను చూడలేకపోయా. అతివేగం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుంది' అని ట్రావెల్స్ బస్సు డ్రైవర్ వివరించారు. చిత్రదుర్గ జిల్లాలోని జాతీయరహదారి-48పై గోర్లత్తు క్రాస్ వద్ద గురువారం వేకువజామున 2.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బెంగళూరు నుంచి గోకర్ణ వెళ్తున్న సీబర్డ్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును కంటెయినర్ లారీ ఢీకొట్టింది. బస్సు డీజిల్ ట్యాంక్‌కు మంటలు అంటుకోవడంతో ప్రమాదం జరిగింది.

# ఒడిషాలో భారీ ఎన్‌కౌంటర్

- మావోయిస్ట్ కీలక నేత గణెళిశ్ హతం
- మొత్తం నలుగురు మృతి చెందినట్లు వెల్లడి



**భువనేశ్వర్, డిసెంబర్ 25 :** ఒడిశాలోని కందమాల్ జిల్లా గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో మావోయిస్టు కీలక నేత, కేంద్ర కమిటీ సభ్యుడు పాకా హనుమంతు అలియాస్ గణెళిశ ఉయికే ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆయనపై రూ. 1.10 కోట్ల రివార్డు కూడా ఉందని తెలిపారు.హనుమంతు స్వస్థలం తెలంగాణలోని నల్గొండ జిల్లా చండూరు మండలం పు÷-లలెంల గ్రామం అని అధికారులు తెలిపారు. మరోవైపు ఘటనాస్థలిలో ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టుల కోసం గాలింపు కొనసాగుతోంది. పాక చంద్రయ్య, పాపమ్మ దంపతుల ఆరుగురు సంతానంలో గణెళిష్ మొదటివారు. ఆయన 1961లో జన్మించారు. హనుమంతుకు ముగ్గురు చె÷-లలెళ్లు, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. చండూరులో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ నల్గొండలో చేస్తూ రాడికల్ యూనియన్‌లో పనిచేశారు. 45 ఏళ్ల క్రితం ఏచూరి శ్రీనివాస్ హత్యలో ఆయన కీలకపాత్ర పోషించారు. అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లి నక్సలైట్ ఉద్యమంలో చేరారు. అప్పటినుంచి ఆయన ఇంటివైపు చూడలేదు. ఆయన అమ్మ, నాన్న చనిపోయినప్పుడు కూడా రాలేదు. మండల కమిటీ నుంచి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి నేతగా ఎదిగి మూడు రాష్ట్రాలకు కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ఇటీవలి కాలంగా ఆరోగ్యం బాగాలేక ఇబ్బంది పడుతున్నారని సమాచారం. ÷ూక హనుమంతు చిన్నప్పటినుంచే కమ్యూనిస్టు భావజాలం కలిగి ఉన్నారని ఆయన సోదరుడు తెలిపారు. హనుమంతు తండ్రి సీపీఎం పార్టీలో పనిచేశారు. దీంతో చదువుకునే రోజుల్లోనే ఉద్యమం వైపు వెళ్లారు.



# తిరుమల కొండకు పోటెత్తిన భక్తులు

## దర్శనానికి 30 గంటల సమయం

**తిరుమల, డిసెంబర్ 25 :** తిరుమల కొండ భక్తులతో కిటకిటలాడుతోంది. వరుస సెలవుల నేపథ్యంలో శ్రీవారిని దర్శించుకునేందుకు జనం భారీగా తరలివచ్చారు. దీంతో శ్రీవారి సర్వదర్శనానికి 30 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు, నారాయణగిరి షెడ్లు భక్తులతో నిండిపోయాయి. శిలాతోరణం క్యూలైన్ వరకు భక్తులు వేచి ఉన్నారు. అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్ల కోసం రద్దీ నెలకొంది. కోటా పూర్తికావడంతో అధిక సంఖ్యలో భక్తులు టోకెన్ల కోసం ఒక్కసారిగా ఎగబడటంతో విధుల్లో ఉన్న పోలీసు, తితిదే సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై పరిస్థితి అదుపు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. టోకెన్ల కోటా పూర్తయిందని తితిదే సిబ్బంది ప్రకటించడంతో.. భక్తులు తిరుమలకు పయనమయ్యారు. మరో వైపు తిరుమలకు వెళ్లేందుకు భక్తులు సొంత వాహనాల్లో తరలి రావటంతో అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహనాల రద్దీ అమాంతం పెరిగిపోయింది. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద భద్రతా సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలిస్తుండటంతో వాహనాల తనిఖీకి కొంత సమయం పడుతోంది. అలిపిరి ముఖద్వారం వరకు వాహనాలు బారులు తీరడంతో రద్దీని నియంత్రిస్తున్నారు.

# బోల్తాపడ్డ స్కూల్ బస్సు

## స్వల్ప గాయాలతో బయటపడ్డ విద్యార్థులు

**జడ్చర్ల, డిసెంబర్ 25 :** మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ వద్ద స్కూల్ బస్సు బోల్తా పడింది. పలువురు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా మరికల్ లోని మణికంఠ జూనియర్ కాలేజీకి చెందిన బస్సు విహార యాత్రకు వెళుతుండగా బోల్తా పడింది. హైదరాబాద్‌లోని జలవిహార్‌కు వెళ్లేందుకు కాలేజీకి చెందిన బస్సులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో బాలా నగర్ వద్ద హైదరాబాద్-బెంగళూరు హైవేపై ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు స్వల్ప గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# కొల్లూరులో జంట హత్యలు

## రక్తపు మడుగులో తల్లి, కుమారుడు

**కొల్లూరు:** సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ జేపీ కాలనీలో తల్లి, కుమారుడు హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో మరో వ్యక్తి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరాడు. పోలీసుల కథనం ప్రకారం... నారాయణపేట జిల్లా కర్ని గ్రామానికి చెందిన శివ, వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన చంద్రకళ.. ఆమె కుమారుడు రేవంత్ నాలుగు రోజుల క్రితం తెల్లాపూర్ జేపీ కాలనీకి వచ్చి నివాసం ఉంటున్నారు. శివ క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో అలికిడి లేకపోవడంతో.. చుట్టుపక్కల వారు చూసేసరికి చంద్రకళ, రేవంత్ రక్తపు మడుగులో పడి ఉన్నారు. శివ తీవ్ర గాయాలతో ఉండగా.. పోలీసులు అతన్ని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గణేశ్ పటేల్ తెలిపారు.



## సర్పంచ్ బిస్ ధనలక్ష్మి చందర్ గౌడ్‌కు సన్మానం చేసిన కురుమ సంఘం నాయకులు

**ఆత్మకూరు (ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం) మండలం సర్పంచ్ బిస్ ధనలక్ష్మి చందర్ గౌడ్ ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్ కు కురుమ సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ధనలక్ష్మి చందర్ గౌడ్ మాట్లాడుతూ కురుమ సంఘం అభివృద్ధికి నా వంతు సహకారాలు అందిస్తానని అలాగే ఒక టేబుల్ 50 కుర్చీలు సంఘానికి అందజేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం మండల అధ్యక్షుడు కోరే బిక్షపతి, పట్టణ అధ్యక్షుడు కోరే లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు కోరే బీరప్ప, ప్రధాన కార్యదర్శి మజ్జిగ అశోక్, మండల యూత్ అధ్యక్షుడు మజ్జిగ రాంబాబు, కోశాధికారి మజ్జిగ రవీందర్, నేడు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు శ్రీశైలం, జిల్లా నాయకులు మాజీ అధ్యక్షులు కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.



## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ఆత్మకూరు (ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండల కేంద్రంలోని చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలేరు నియోజకవర్గంలో క్రిస్మస్ వేడుకలను ఆనందంగా జరుపుకుంటున్నారని ఏసుప్రభు బోధనల స్ఫూర్తితో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం అని మతాల సంక్షేమం అభివృద్ధికి తోడ్పడుతున్నారని క్రిస్మస్ పర్వదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య క్రిస్టియన్స్ సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి,ఆత్మకూరు సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి మాజీ ఎంపిటిసి యాస కవిత ఇంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నాగేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధులు, బిసి సెల్ అధ్యక్షుడు బత్తిని ఉప్పలయ్య వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## అత్యంత వైభవోపేతంగా క్రిస్మస్ వేడుకలు

**ఆళ్లపల్లి, డిసెంబర్ 25 (రాజముద్ర):** ఆళ్లపల్లి మండలంలోని రోమన్ క్యాథలిక్ మిషన్ (ఆర్సిఎం), దక్షిణ భారత సంఘం (సిఎస్ఐ), కృపామందిరం, అగ్నిమినిస్ట్రీతో పాటు పలు పెంతుకోస్తు చర్చిల్లో లోకరక్షకుడైన యేసుక్రీస్తు జన్మదిన మహోత్సవాన్ని క్రైస్తవ భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్సిఎం చర్చ్ విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జేసు సుప్రసాద్, సిఎస్ఐ పాస్టర్లు గుజ్జర్లపూడి ఏసుపాదం, లింగాల శామ్యూల్, మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు పరమ అశోక్ తదితరులు మాట్లాడుతూ కరుణామయుడు, ప్రపంచ శాంతికి మార్గదర్శకుడైన యేసుప్రభువు బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని అన్నారు. గ్రామాల్లో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించామని, ప్రతి క్రైస్తవుడు సత్ప్రవర్తనతో సన్మార్గంలో నడవాలని, నిజాయితీ, సేవాభావం, సహనం, ఐక్యత, ప్రేమతో జీవించాలని భక్తులకు ఉపదేశించారు. నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించే జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎస్ సుపీరియర్ సిస్టర్ ప్రశాంత, సిస్టర్ మహిత, సిస్టర్ దామరీస్, సిస్టర్ జ్యోతిర్మయి, యానిమేటర్ ప్రభాకర్, ఉపదేశులు కిరణ్, అంతోని, నాగేశ్వరరావు, రాములు, సంఘ నాయకులు నాగేశ్వరరావు, రాంబాబు, రామ్మూర్తి, మల్లిపెద్ది కన్నయ్య, చిరంజీవి, చంటి, చంద్రకాంత్, స్వామిదాస్, లాజర్, ప్రసాద్, బాబు, సుధాకర్, జీవన్, నవీన్, భరత్, శృచిల్, బన్నీ, రత్తయ్య, అబ్బాస్, దిలీప్, ప్రవీణ్, రాజు, స్టాలిన్, రాము తదితరులతో పాటు మరియుదళం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



## ఘనంగా ఆయన సన్నిధి పెంతుకోస్తు మినిస్ట్రీస్ వారి క్రిస్మస్ వేడుకలు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శేరిలింగంపల్లి నియోజక వర్గం హఫీజ్ పెట్ డివిజన్ అంబేద్కర్ నగర్ లో గల ఆయన సన్నిధి పెంతుకోస్తు మినిస్ట్రీస్ క్రిస్మస్ వేడుకలను పాస్టర్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రార్థన గీతాలతో యేసు క్రీస్తు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాస్టర్ ఇమ్మానియేల్ ప్రసంగించారు. యేసు క్రీస్తు ప్రభువు గురించి దాసులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆయన మార్గం ప్రేమ, దయ ,కరుణ లను కలిగి ఉండి తోటి వారి మేలు కోరి, క్షమా గుణం కలిగి ఉండాలనీ ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సంఘ సభ్యులు బస్తివాసులు పాల్గొన్నారు.

## యేసు క్రీస్తు బోధనలు ఆదర్శనీయం

- మానవాళికి క్రీస్తు శాంతి సందేశం స్ఫూర్తిదాయకం..
- నీలం మధు ముదిరాజ్



**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆదర్శనీయం, అనుసరణీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని చిట్కుల్ పరిధిలోని బ్యులా, ఎంవీ చర్చిలలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని కేక్ కట్ చేసి, ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి వికలాంగులకు నిత్యావస ర సరుకులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడిగా ప్రజల మధ్యనే నడయాడి సమాజానికి శాంతి సందేశం అందించిన దయామయుడు యేసుక్రీస్తు అని కొనియాడారు.క్రీస్తు చూపిన శాంతి మార్గం సర్వ మానవాళికి స్ఫూర్తి దాయకమని, ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ ప్రతి ఒక్కరూ ప్రేమ, జాలి, దయా గుణాలు కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో బ్యూలా చర్చి నిర్వాహకులు ప్రకాష్ రావు, రాజ్య లక్ష్మి, ఎంవీ చర్చి నిర్వాహకులు శ్రీమాన్, వికలాంగుల సంఘం రాష్ట్ర నాయకులు రవి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, రజక సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు గోపాల్, రాజ్ కుమార్, గౌరి శంకర్, అనిల్, నిర్వాహకులు పాల్గొన్నారు.

## లోక రక్షకుడు క్రీస్తూ జన్మదినమే క్రిస్మస్

- వితంతులకు, వృద్ధులకు, పేద మహిళలకు చీరెలు పంపిణి
- బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబా




**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 4వ వార్డు ఖాసీంపేట లో బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబా క్రిస్మస్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్విట్స్ పంపిని చేశారు బిషప్ దుర్గం ప్రభాకర్ తల్లి తండ్రులు దుర్గం వెంకటయ్య మైసమ్మ చేతుల మీదుగా 100 మంది వితంతులకు, వృద్ధులకు, పేద మహిళలకు చీరెలు పంపిణి చేశారు.బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ లోకరక్షకుడు క్రీస్తూ జన్మదినమే క్రిస్మస్ అనీ,పాపులను రక్షించుటకు క్రీస్తూ యేసు లోకమునకు వచ్చాడని సర్వ మానవులను దేవుడు ఒక్కడే అనీ క్రైస్తవుల విశ్వాసం అనీ అన్నారు. యేసుక్రీస్తు జననానికి గుర్తుగా, ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలు జరుపుకునే అతి పెద్ద పండుగ అనీ అన్నారు.ఈ కార్యక్రమం లో ఆర్చ్ బిషప్ యం. పి. హెచ్. హెచ్. మోజెస్, తీతు సుధాకర్, బాబు, కిరణ్, జానయ్య, వెంకన్న, యేసుపాదం, కళింగ రెడ్డి, సురేష్, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వాళ్లు బ్యాడ్ గర్ల్స్ కాదు.. గుడ్ గర్ల్స్

- పేట వాసి ప్రొడ్యూసర్‌గా బ్యాడ్ గర్ల్స్ చిత్రం
- మహిళా ప్రేక్షకుల నుంచి విశేష ఆధరణ
- మొదటి రోజు కిట కిటలాడిన థియేటర్
- సమాజానికి మంచి సందేశామిచ్చారంటూ మహిళల కితాబు



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లాకు చెందిన ఇమ్మడి సోమనర్సయ్య ప్రొడ్యూసర్ గా నిర్మించిన బ్యాడ్ గర్ల్స్ చిత్రం గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తిరుమల మల్లీ ప్లెక్స్‌లో ప్రదర్శితమైంది. మొదటిరోజే బ్యాడ్ గర్ల్స్ సినిమాకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా పలువురు ప్రేక్షకులు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా వాసి ఇమ్మడి సోమనర్సయ్య సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షను వారికీ జరుగుతున్న అన్యాయాన్ని దుష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరికి కనువిప్పు కలిగేలా బ్యాడ్ గర్ల్స్ చిత్రాన్ని నిర్మించారన్నారు. మొదటి రోజు సినిమా చూసిన మహిళా ప్రేక్షకులు వాళ్ళు బ్యాడ్ గర్ల్స్ కాదని గుడ్ గర్ల్స్ అంటూ కితాబు ఇచ్చారు. ప్రస్తుత సమాజానికి ఇలాంటి సినిమా ఎంతో అవసరమని సినిమా ద్వారా మంచి సందేశాన్ని అందించారని అన్నారు. ఇంట బయట చిన్న నుంచి పెద్ద వరకు మహిళలకు ఎలా వివక్షతను ఎదుర్కొంటున్నారో కళ్ళకు కట్టినట్లు చూపించి కన్నీరు తెప్పించారన్నారు. సినిమా లో బ్యాడ్ గర్ల్స్ చెప్పినట్లుగా ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో మహిళలకు ఆత్మరక్షణకు అవసరమైన శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సినిమాకు పాటలు చంద్రబోస్ అందించగా దర్శకత్వం మున్నా చేశారని విజయవంతంగా 100 రోజుల వేడుకల చేసుకుంటుందని ప్రేక్షకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు మీలా వంశీ, బచ్చు పురుషోత్తం,రాచకొండ శ్రీనివాస్, వీరవెల్లి విజయ శంకర్,మిట్టపల్లి రమేష్,కలకోట లక్ష్మయ్య,రాము, రవి,సోమ సుమన్,సోమా ప్రవీణ్, శివ, రంగారెడ్డిలతో పాటు మహిళా ప్రేక్షకులు పాల్గొన్నారు.

## మియాపూర్ కల్వరి టెంపుల్‌లో క్రిస్మస్ సందడి

- ఫాస్టర్ డా. పి. సతీష్ కుమార్ చే ఉదయం 4:30కు చర్చిలో తొలి ఆరాధన
- ప్రపంచంలోనే అతిపెద్ద రెండవ లార్జెస్ట్ టెంపుల్ కల్వరి టెంపుల్
- భారీగా తరలివస్తున్న భక్తులు



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** మియాపూర్ లోని ప్రసిద్ధ కల్వరి టెంపుల్ లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. యేసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భక్తులతో కిటకిటలాడుతుంది. తెల్లవారుజామున 4:30 నిమిషాలకు తొలి ఆరాధన జరుగుతుంది. ప్రపంచంలోనే అతిపెద్ద రెండో లార్జెస్ట్ టెంపుల్ కల్వరి టెంపుల్, భక్తులు పెద్ద సంఖ్యలో కల్వరి టెంపుల్ కు తరలివస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక లైటింగ్, నక్షత్రాలు, క్రిస్మస్ ట్రీలు బైబిల్ ఆధారిత అలంకరణలతో అందంగా ముస్తాబు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు, కీర్తనలు, సందేశాలతో భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తున్నారు. చిన్నారులు శాంతా క్లాజ్ వేషాధారణలో సందడి చేయగా, కుటుంబ సభ్యు లు కలిసి ప్రార్థనలో పాల్గొంటున్నారు. విదేశాల నుంచి వచ్చిన భక్తులు కూడా క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పార్కింగ్, భద్రత, వైద్య, సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు, వాలంటీర్లు సేవలందిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. కల్వర్ టెంపుల్ లో జరిగే క్రిస్మస్ వేడుకలు హైదరాబాదులోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకలలో ఒకటి గా గుర్తింపు పొందాయి. యేసు క్రీస్తు బోధించిన ప్రేమ, శాంతి, మానవత్వం సందేశాలను ఈ సందర్భంగా డా. పి. సతీష్ కుమార్ పాస్టర్ భక్తులకు గుర్తు చేశారు.

## దేశానికి కొత్త బాటలు వేసిన దార్శనికుడు వాజ్ పేయి

### బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** భారతదేశానికి కొత్త బాటలు వేసిన దార్శనికుడు,ఫోక్రాన్ అణు పరీక్షలతో భారత్ సత్తాను ప్రపంచానికి చాటిన ధీశాలి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి అని బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ అన్నారు.మండల కేంద్రంలో గురువారం భారత మాజీ ప్రధాని వాజ్ పేయి 101 వ జయంతి వేడుకలు గురువారం పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి పాలన జాతి అభివృద్ధికి దివిటీలా పనిచేస్తోందన్నారు.అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన జరగాలని కోరుకుంటూ అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని,అణు పరీక్షలు చేయడం,కార్గిల్ విజయం కోసం పని చేశారని కొనియాడారు.అదే విధంగా రెండు సార్లు దేశంలో అధికారంలోకి వచ్చామంటే వాజ్‌పేయి నేర్పిన సిద్ధాంతాలేనని గుర్తు చేశారు.తదుపరి బిజెపి సీనియర్ నాయకులు గెల్లా చక్రపాణిని పార్టీ కార్యకర్తలతో కలిసి సుధాకర్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు..ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు,ఉపాధ్యక్షులు పురాణం దివాకర్,కొండా హర్షవర్ధన్,మండల నాయకులు కందరబోయిన గోపి, ఎలిగేటి గిరి,దేశబోయిన వేణుబాబు,జోగపర్తి నారాయణ, బ్రమ్మా వరపు ఉదయ్,రాజపుత్ర సాయి,బొమ్మవరపు నాగరాజు,జల్ల సురేష్,తదితరులు పాల్గొన్నారు



## ధావత్ ఫ్యామిలీ ధాబాను ప్రారంభించిన దయాకర్ రెడ్డి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ప్రజలకు రుచికరమైన బిర్యానీ రుచులను అందించి ఉన్నతంగా అభివృద్ధి చెందాలని మంత్రి పొంగులేటి ఖమ్మం క్యాంప్ కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు.కూసుమంచి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చెందిన దావత్ ఫ్యామిలీ దాబా రెస్టారెంట్ ను గురువారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మకంతో దాబాకి వచ్చే వారికి నాణ్యత కలిగిన రుచికరమైన వంటకాలను అందించి,అభిమానాన్ని చూరగొనాలని సూచించారు.తొలుత ధాబా నిర్వాహకులు కుమార్ వారికి ఘన స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కూసుమంచి క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,సర్పంచ్ లు కొండ కృష్ణవేణి,జర్పుల అనసూయ,వడిత్యా వెంకటేశ్,ఉప సర్పంచ్ నాగేశ్వరావు,మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు,మాజీ సర్పంచ్ గుండా దామోదర్ రెడ్డి,మాజీ ఎంపిటిసి మాదాసు ఉపేందర్,మాజీ ఏఎంసి చైర్మన్ సేట్ రామ్ నాయక్,పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



## చర్చి సింగారం గ్రామంలో క్రిస్మస్ వేడుకలు

**ఆత్మకూరు (ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలోని సింగారంలో చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న రేవ ఇస్సాక్ మందుల పాస్టర్ బోధిస్తూ దేశ ప్రజలు సుభిక్షతో శాంతి సమాధానంగా ఉండాలని పాలకులు కూడా పేద ప్రజల అభ్యున్నతికి సంక్షేమం కోసం పాటుపడాలని జోడించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మందుల దాసు,పల్లెర్ల శాంతి కుమార్, పులిగిల్ల దావీద్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మద్యం బాటిల్లతో మహిళల నిరసన

**రామారెడ్డి డిసెంబర్ 25 రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం ఉప్పల్ వాయి గ్రామంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో వార్డ్ మెంబర్గా ఓటమి చెందిన మహిళ తిట్ల పురాణం బూతులు తిడితే దానికి నిరసనగా వార్డు మహిళలు ఆమె పంపిణీ చేసిన మద్యం బాటిళ్లు, చీరలు, తిరిగి గ్రామపంచాయతీ ఆవరణలో వేసి నిరసన తెలిపారు, తరువాత పోలీసు వారు వచ్చి గొడవలు కాకుండా సూచనలు చెప్పి శాంత పరిచారు.



## రాగిబావి సర్పంచ్ నీ సన్మానించిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

**మోత్కూర్. రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండల పరిధిలోని రాగిబావి బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ గా గెలుపొందిన మెండు శ్రీవాణి చంద్రశేఖర్ రెడ్డి నీ సాల్వతో సన్మానం చేసిన నలగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి.



## సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడికి సన్మానం చేసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ఆత్మకూరు (ఎం) రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ దగ్గర ఆత్మకూరు మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి కి ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు నాతోటి సర్పంచ్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన కాంగ్రెస్ సర్పంచులు ఎంపీటీసీలు మండల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఏసు క్రీస్తు జీవితం ఆదర్శనీయం

### బిజెపి జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** సిలువ పై ఉన్న చివరి క్షణాల్లో కూడా శత్రువులను సైతం క్షమించి తన ప్రేమతత్వాన్ని చాటిన ఏసుక్రీస్తు జీవితం ప్రజలందరికీ ఆదర్శమని బిజెపి జిల్లా నాయకులు గుండా ఉపేందర్ అన్నారు. కూసుమంచి మండల కేంద్రంలోని జిప్సీ, పెంతుకొస్తు ప్రార్థన మందిరంలో గురువారం తెల్లవారుజామున నిర్వహించిన క్రిస్ట్ మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసుక్రీస్తు మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమా హృదయం కలిగి తన బోధనలతో ప్రజలను మంచి వైపు నడిపించారాని తెలిపారు. మనుషుల మధ్య సామరస్యం ఉండాలని, త్యాగనిరతి కలిగి ఉండాలని, తోటివారికి నిస్వార్థ సేవ చేయాలనే క్రీస్తు బోధనలు అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. క్రిస్ట్ మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో తెల్లవారుజాము నుండి మందిరాల్లో ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రార్థన మందిరాల పాస్టర్లు కుప్పుస్వామి, ఆశీర్వాదం, జేమ్స్ లీ, సంఘస్తులు కమలమ్మ, రామమూర్తి, కరాటే శివ, మంద శేఖర్, ప్రవీణ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ వ్యాఖ్యలపై జగదీశ్వర్ రెడ్డి ఫైర్

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు బిఆర్ఎస్ నేత కెసిఆర్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక బూతులు మాట్లాడి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడాతూ రేవంత్ ది కంపునోరు మురుగు కాల్వ కంటే అధ్వానమని ఎద్దేవా చేశారు నీ మాటలు వీని మీ సర్పంచులే సిగ్గుపడుతున్నారని సాధారణ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిన్ను నీ పార్టీని ప్రజలు బొంద పెట్టడం ఖాయమన్నారు, కెసిఆర్ ప్రజల్లోకి వస్తే తమ బట్టలు విప్పుతాడు అన్న భయంతోనే ఫ్రస్టేషన్లో రేవంత్ రెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని తెలిపారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అజ్ఞానపు మంత్రి అని కనీస అవగాహన లేదన్నారు కృష్ణా, గోదావరి జలాలు దోపిడికి గురవుతున్నాయని చెప్పినా పట్టించుకోవడం లేదని ఒకవేళ పొరపాటు జరిగితే తప్పు ఒప్పుకొని చెంపలు వేసుకోవాలని అన్నారు మహబూబ్నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు అన్యాయం జరుగుతుందని ఈ విషయంలో కెసిఆర్ కాదు ప్రజలు కూడా ప్రభుత్వం తోలు వలుస్తారని హెచ్చరించారు ఈ ప్రభుత్వం ఇంకా కళ్ళు తెరువక పోతే ప్రజా ఉద్యమం మొదలుపెడతామని తెలియజేశారు ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యతని వ్యాఖ్యలు చేశారు.



## కుప్పకూలిన హెలికాప్టర్..

### ఐదుగురు మృతి

**టాంజానియా :** టాంజానియాలోని కిలిమంజారో పర్వతంపై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఓ హెలికాప్టర్ కుప్పకూలిపోవడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. కిలిమంజారో పర్వతంపై ఉన్న బరాఫు క్యాంపు సమీపంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుందని టాంజానియా పౌర విమానయా నశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. పర్వతంపై ఉన్నవారిని వైద్యచికిత్స కోసం తరలించే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు పేర్కొంది. మృతుల్లో ఇద్దరు విదేశీ పర్యాటకులతో పాటు డాక్టర్, టూరిస్ట్ గైడ్, పైలట్ ఉన్నట్లు వెల్లడిం చింది. అయితే, ఆ పర్యాటకులు ఏ దేశానికి చెందినవారనే వివరాలను మాత్రం తెలపలేదు. ప్రమాదానికి కారణం తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారం భించినట్లు స్థానిక పోలీసు అధికారి తెలిపారు.



## కువైట్‌లో ఎంట్రీ, విజిట్ వీసాలపై సరికొత్త ఫీజులు

**కువైట్ :** కువైట్‌లోకి ఎంట్రీ, విజిట్ వీసాలపై సరికొత్త ఫీజులు విధించారు. కొత్త ఎగ్జిక్యూటివ్ నిబంధనల కింద ఈ వీసాలపై నెలకు 10 కువైటీ దినార్ల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. డిసెంబర్ 23 నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. ఈ కొత్త నిబంధనలు విజిటర్లు, ఇన్వెస్టర్లు, ఉద్యోగులు, రెసిడెంట్స్‌కు వర్తిస్తాయని కువైట్ హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. వీసా కేటగిరీల్లో నివాస ప్రక్రియను క్రమబద్ధీకరించే లక్ష్యంతో వీటిని తీసుకువచ్చారు. మరోవైపు విదేశీయులు తమ జననాల్ని నమోదు చేసుకోవడానికి 4 నెలల సమయం ఇచ్చారు. అది దాటితే జరిమానాలు విధించనున్నారు. మొదటి నెలలో రోజుకు 2 కువైటీ దినార్లు.. మొదటి నెల అనంతరం రోజుకు 4 కువైటీ దినార్లు చెల్లించాల్సి ఉంటుందని నిబంధనల్లో పేర్కొన్నారు. డొమెస్టిక్ వర్కర్స్‌కు సంబంధించిన నిబంధనలను అక్కడి ప్రభుత్వం రెగ్యులేట్ చేసింది. వారి వయసు 21-60 మధ్యలో ఉండాలి. యజమాని అభ్యర్థన మేరకు ఈ ప్రవేశ అనుమతులు జారీ చేస్తారు. ఈ రెసిడెన్సీ పర్మిట్ ఉన్న కార్మికులు నాలుగు నెలలపాటు కువైట్ వెలుపల ఉండేందుకు అనుమతి ఉంటుంది. ఆ తర్వాత స్పాన్సర్ .. ఆబ్సెన్స్ పర్మిట్‌కు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. లేకపోతే రెసిడెన్సీ రద్దవుతుంది.

# క్రీడల్లో బంధుప్రీతి ఆనాడే అంతమైంది

### ప్రధాని నరేంద్ర మోదీ



**న్యూఢిల్లీ :** క్రీడాకారుల ఎంపికలో బంధుప్రీతి 2014లోనే అంతమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇప్పుడు కష్టపడేతత్వం, నైపుణ్యం ఉన్న పేద పిల్లలు కూడా ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని తెలిపారు. యువతలో క్రీడా సంస్కృతి, నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించే లక్ష్యంతో దిల్లీలో నిర్వహించిన 'సంసద్ ఖేల్ మహోత్సవ్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా వేలాది ప్రతిభావంతులైన క్రీడాకారులను దేశం గుర్తిస్తోందని చెప్పారు. "2014కు ముందు క్రీడాకారుల ఎంపికలో అవినీతి, అక్రమాలు ఉండేవి. ఈ విధానానికి ముగింపు పలికి దశాబ్దమైంది. మేం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు పూర్తిగా మెరుగయ్యాయి. ప్రస్తుతం పేద కుటుంబాల పిల్లలు కూడా ప్రతిభ, కష్టపడే తత్వంతో క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారు" అని మోదీ తెలిపారు. 2014కు ముందు క్రీడల కోసం దేశ బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయిస్తే.. ఆ తర్వాతి కాలంలో రూ.3వేల కోట్లు కంటే ఎక్కువ కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక పథకాల ద్వారా అర్హులైన అథ్లెట్లకు నెలకు రూ.25 వేల నుంచి రూ.50వేల వరకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. "దేశంలో ఉన్న ప్రతి అథ్లెట్‌కు ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. మీరు కేవలం మీ విజయం కోసం మాత్రమే ఆడటం లేదు. దేశం కోసం ఆడుతున్నారు. త్రివర్ణ పతాక గౌరవం కోసం ఆడుతున్నారన్న విషయం మర్చిపోవద్దు" అని దిశానిర్దేశం చేశారు. తమ పిల్లలు కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని, క్రీడా రంగంలో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. అది వారిని శారీరకంగా, మానసికంగానూ ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదం చేస్తుందన్నారు. 2030లో కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యమిస్తోందని, 2036లో ఒలింపిక్స్ క్రీడలకు కూడా వేదికగా నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఈ సందర్భంగా ప్రధాని మోదీ తెలిపారు.

## సైనికులు ఇన్‌స్టాగ్రామ్ వాడొచ్చు.. కానీ

### ఆర్మీ కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ :** సైనికులు సామాజిక మాధ్యమాలను వినియోగించడంపై కఠిన వైఖరి అవలంబిస్తూ వచ్చిన భారత రక్షణశాఖ.. తాజాగా ఈ నిబంధనలను కాస్త సడలించింది. జవాన్లు, సైనికాధికారులు ఇన్‌స్టాగ్రామ్‌ను వీక్షించేందుకు అనుమతి కల్పించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రక్షణశాఖ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఇందుకు కొన్ని షరతులు కూడా విధించినట్లు సమాచారం. తాజా సవరణలకు సంబంధించి అన్ని సైనిక యూనిట్లకు ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ మార్గదర్శకాలు పంపించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. కేవలం సమాచారం తెలుసుకునేందుకు మాత్రమే సైనికులు ఇన్‌స్టాగ్రామ్ ను ఉపయోగించాలని అందులో స్పష్టంగా వెల్లడించారు. పోస్టులు చేయడం, కామెంట్లు పెట్టడం, షేరింగ్, మెసేజ్‌లకు రియాక్ట్ అవడం వంటివి చేయకుండా కఠిన ఆంక్షలు అమల్లో ఉంటాయని ఆ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. అంటే.. సైనికులు కేవలం ఇన్‌స్టాగ్రామ్‌ను వీక్షించొచ్చు కానీ.. అందులో ప్రతిస్పందించేందుకు అనుమతి ఉండదన్నమాట. ఇవే నిబంధనలు ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ వంటి ఇతర మాధ్యమాలకు కూడా ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఇక, తమ ఖాతాల్లో తప్పుదోవ పట్టించే పోస్టులు, నకిలీ సమాచారం ఉన్నట్లయితే వాటిని తక్షణమే సీనియర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. వీపీఎన్‌లు, నకిలీ వెబ్‌సైట్లు, వెబ్ ప్రాక్సీలు వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోను ఉపయోగించొద్దని సైనికులను మరోసారి హెచ్చరించారు. డిజిటల్ అవగాహన, దేశ భద్రత మధ్య సైనికులు సమతూకంగా ఉండాలని ఈ మార్గదర్శకాలతో గుర్తుచేశారు. అయితే, సైనికులు వీటిని వినియోగించడంపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తుంటామన్నారు. హనీట్రాప్, డబ్బు ఆశ జూపి సున్నితమైన సమాచారాన్ని దొంగలించడం వంటి ఘటనల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వినియోగంపై ఆర్మీ కఠిన నిబంధనలు అమలుచేస్తోంది. 2020లో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సహా 89 మొబైల్ యాప్‌లపై సైన్యం నిషేధం విధించింది. అయితే, ఆ తర్వాత ఇందులో కొన్ని సడలింపులు తీసుకొచ్చింది. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్, లింక్డ్ఇన్, టెలిగ్రామ్, వాట్సప్ వంటి వాటిని పాక్షికంగా వినియోగించేందుకు అనుమతినిచ్చింది.

## అధికారం కంటే.. పార్టీ కార్యకర్తగా ఉండటమే ఇష్టం

### డీకే శివకుమార్



**కర్ణాటక :** కర్ణాటక రాజకీయాలు ఇటీవల దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారం, పదవుల కంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఉండటమే తనకు ఇష్టమని వ్యాఖ్యానించారు. బుధవారం దిల్లీలోని కర్ణాటక భవన్‌లో డీకే విలేకరులతో మాట్లాడారు. 1980 నుంచి పార్టీ కోసం అవిశ్రాంతంగా పనిచేశానని, ఇప్పటికీ పార్టీ వర్కర్‌గా ఉండేందుకే తాను ఇష్టపడతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకత్వ మార్పు గురించి ఇటీవల వెల్లువెత్తిన ఊహాగానాలపై ఆయన మాట్లాడుతూ.. 'మా మధ్య (సీఎం సిద్ధరామయ్యను ఉద్దేశిస్తూ) ఏం జరిగిందో నేను వెల్లడించలేను. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు కలిసి పనిచేశాం. పార్టీ కోసం ప్రతిఒక్క కార్యకర్త ఎంతో కష్టపడ్డాడు. హైకమాండ్ మాకు స్వేచ్ఛనిచ్చింది. కలిసి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాం. పార్టీ అధికారంలోకి రావడానికి డీకే, సిద్ధూతో పాటు ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలు కూడా ఎంతో కృషి చేశారు' అని అన్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి తర్వాత నాయకత్వ మార్పునకు సంబంధించిన చర్చల గురించి విలేకరులు ప్రశ్నించారు. అలాంటి చర్చలు మీడియాలో మాత్రమే జరుగుతున్నాయని.. ప్రభుత్వం, పార్టీలో కాదని డీకే స్పష్టం చేశారు. ఇక, ప్రస్తుతం పార్టీ హైకమాండ్‌ను కలవడం లేదని, విదేశాల నుంచి వచ్చిన రాహుల్‌గాంధీని ఇబ్బంది పెట్టాలనుకోవడం లేదని పేర్కొన్నారు. మంత్రివర్గ విస్తరణపై


## మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం..

### కాగజ్‌నగర్‌కు చెందిన నలుగురి మృతి

**సిర్పూర్:** మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన నలుగురు మహిళలు మృతిచెందారు. దేవాడ-సోండో సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్ నగర్ పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీకి చెందిన జాకీర్ కుటుంబం వైద్యం కోసం నాగ్‌పుర్‌లోని ఆస్పత్రికి వెళ్లారు. వారితో పాటు బంధువులు కూడా ఉన్నారు. బుధవారం అర్ధరాత్రి దాటాక తిరుగు ప్రయాణంలో వీరు వస్తున్న కారు అదుపుతప్పి వంతెన పైనుంచి పడింది. దీంతో జాకీర్ భార్య సల్మా బేగం, కుమార్తె శబ్రీమ్‌తో పాటు బంధువులు ఆఫ్జా బేగం, సహారా మృతిచెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను చంద్రపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



## చైనాలో భారత ట్రావెల్ వ్లాగర్ నిర్బంధం..



**చైనా :** అరుణాచల్ ప్రదేశ్ గురించి మాట్లాడినందుకు తనను చైనా అధికారులు నిర్బంధించారని భారత్‌కు చెందిన ట్రావెల్ వ్లాగర్ అనంత్ మిత్తల్ ఆరోపించాడు. ఈనెల 16న జరిగిన ఈ ఘటన గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో ద్వారా వెల్లడించాడు. 'ఆన్‌రోడ్ ఇండియా' అనే పేరుతో అనంత్ ట్రావెల్ వీడియోలు చేస్తుంటాడు. ఇటీవల తన స్నేహితుడిని కలిసేందుకు చైనా వెళ్లానని అనంత్ తెలిపాడు. గ్వాంగ్‌జౌ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ ప్రక్రియ క్రమంలో తనను ఓ సీనియర్ అధికారి పక్కకు తీసుకెళ్లారన్నాడు. అక్కడ ఓ ప్రాంతంలో కూర్చోబెట్టారని, తనతో పాటు మరో కొరియా, బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తులు కూడా ఉన్నారన్నాడు. దాదాపు 15 గంటలు తనను నిర్బంధించి, విచారించారన్నాడు. తన లగేజీని తనిఖీ చేసి, కెమెరా, ఫోన్‌లన్నింటినీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపాడు. నిర్బంధ సమయంలో తనకు కనీసం ఆహారం అందించలేదని, అక్కడి భారత రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడేందుకు కూడా అనుమతివ్వలేదని పేర్కొన్నాడు. విచారణ ముగిసిన అనంతరం.. తనను వదిలేశారని, ఈ ఘటన తనను మానసికంగా కుంగదీసిందని వాపోయాడు. ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఓ మహిళను షాంఘై విమానాశ్రయంలో చైనా అధికారులు నిర్బంధించిన సంగతి తెలిసిందే. అరుణాచల్‌ప్రదేశ్‌లో తాను కూడా మూడేళ్లు చదువుకున్నానని, జరిగిన ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తూ అప్పట్లో ఓ వీడియో చేశానన్నాడు. అందువల్లే ఇప్పుడు చైనా అధికారులు తనను నిర్బంధించారని ఆరోపించాడు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వాన్ని కోరాడు. ఇక, అనంత్ వీడియోపై భారత్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.



## సిడ్నీ ఉగ్రదాడి ఘటన..

### 'రియల్ హీరో'కు సాహస పురస్కారం..

**సిడ్నీ:** సిడ్నీలోని బోండీ బీచ్‌లో ఉగ్ర కాల్పుల ఘటనలో అహ్మద్ అల్ అహ్మద్ అనే వ్యక్తి ఉగ్రవాదులకు ఎదురొడ్డి ఎంతోమంది ప్రాణాలు కాపాడిన విషయం తెలిసిందే. ఈ 'రియల్ హీరో' ధైర్యసాహసాలకు గాను ఆయనను సాహస పురస్కారంతో సత్కరించాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రణాళిక చేస్తోంది. క్రిస్మస్ సందర్భంగా సిడ్నీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ పాల్గొన్నారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ ప్రకటన చేశారు. బోండీ బీచ్‌లో హనుక్కా వేడుకల్లో యూదులకు వ్యతిరేకంగా జరిగిన ఉగ్ర దాడి తరువాత జరుపుకొంటున్న ఈ క్రిస్మస్ చాలా భిన్నమైందన్నారు. దాడి సమయంలో ప్రజలను రక్షించేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టినవారిని గుర్తు చేసుకున్నారు. వారికి గౌరవ పురస్కారాలు అందించే ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. న్యూ సౌత్ వేల్స్ నేత క్రిస్‌మిన్స్ మాట్లాడుతూ.. యూదులకు ఆస్ట్రేలియన్లు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కష్టకాలం నుంచి బయటపడేందుకు వారికి సాయం చేస్తామన్నారు. ఇక, ఉగ్రదాడి నేపథ్యంలో దేశంలో తుపాకీ చట్టాలను కఠినతరం చేశారు. న్యూసౌత్ వేల్స్ రాష్ట్ర శాసనసభలో దీనికి ఆమోదం లభించింది. ఓ వ్యక్తి పేరు మీద నాలుగు తుపాకులు మాత్రమే ఉండేలా నిబంధనలను సడలించింది. అత్యంత ప్రమాదకరమైన ఆయుధాల వర్గీకరణను చేపట్టాలని నిర్ణయించింది. తుపాకీ లైసెన్స్‌ల కాలపరిమితిని రెండేళ్లకు తగ్గించింది. తిరస్కరణకు గురైన లైసెన్స్‌లపై సమీక్షలు నిలిపివేసింది. దీంతోపాటు ఉగ్రవాదాన్ని ప్రేరేపించేలా ఉండే గుర్తులను బహిరంగంగా ప్రదర్శించడాన్ని నిషేధించింది.

## హసీనా స్థానం నుంచి హిందూ నేత పోటీ..



**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్‌లో మరికొన్ని రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడి రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రాతినిధ్యం వహించిన గోపాల్‌గంజ్-3 స్థానం నుంచి ఓ హిందూ నేత పోటీకి సన్నద్ధమవుతున్నారు. న్యాయవాది అయిన గోవిందా చంద్ర ప్రామాణిక్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారు. అక్కడ మైనార్టీలపై దాడులు జరుగుతున్న వేళ కీలక స్థానం నుంచి హిందూ వ్యక్తి పోటీలో దిగడం గమనార్హం. బంగ్లాదేశ్ జాతీయ హిందూ మొహజోతే (హిందూ మహాకూటమి)లో కీలక సభ్యుడిగా ఉన్న గోవిందా ప్రామాణిక్.. తాను సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. అయితే, తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగనున్నట్లు చెప్పారు. పార్టీల ఆదేశాలకు కట్టుబడి కొన్ని ప్రజా సమస్యలను ఎంపీలు లేవనెత్తలేరని, అటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజల తరఫున గళాన్ని వినిపించేందుకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని స్థానిక మీడియాతో పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం హిందూ జనాభా సుమారు 10శాతం ఉంటుందని.. మత మార్పిడులు, విదేశాలకు వలస వెళ్లడంతో ఈ జనాభా తగ్గిందని ప్రామాణిక్ చెబుతున్నారు. హిందువులపై పలు సందర్భాల్లో దాడులు జరిగాయని, అయినప్పటికీ సురక్షితంగానే ఉన్నారని చెప్పారు. కానీ, ఇటీవల మైనార్టీలే లక్ష్యంగా అక్కడ మళ్లీ దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇదిలాఉంటే, బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరి 12న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ కార్యకలాపాలపై నిషేధం ఉన్న కారణంగా వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ పోటీచేయడం కుదరదని తాత్కాలిక ప్రభుత్వం తాజాగా పేర్కొంది.

# హెర్బల్ టీ అనొద్దు..

**ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కీలక ఆదేశాలు**

**దిల్లీ:** ఒకప్పుడు మార్కెట్‌లో టీ అంటే.. టీపొడి, చక్కెర, పాలుతో చేసినది మాత్రమే. కానీ, తర్వాతి కాలంలో బ్లాక్ టీ, గ్రీన్ టీ వంటివి ప్రాచుర్యం లోకి వచ్చాయి. ఇటీవల కాలంలో హెర్బల్ టీ పేరుతో విక్రయాలు సాగుతున్నాయి. దీనిపై ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కీలక ఆదేశాలు ఇచ్చింది. మూలికలు, మొక్కల నుంచి సేకరించిన మిశ్రమాలతో తయారుచేసేవాటిని టీ పేరుతో పిలవొద్దని ఆహార వ్యాపార నిర్వాహకులకు సూచించింది. ఇవేవీ కామెల్లియా సినెన్సిస్ (తేయాకు శాస్త్రీయ నామం) సేకరించినవి కావు కాబట్టి టీగా వ్యవహరించొద్దని సూచించింది. చట్టం ప్రకారం.. ఇది తప్పుడు, తప్పుదోవ పట్టించే ప్రచారం అవుతుందని పేర్కొంది. ఇటీవల కాలంలో రూయిబోస్ టీ, హెర్బల్ టీ, ఫ్లవర్ టీ వంటి పేరుతో విక్రయాలు సాగుతున్న నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ ఆదేశాలు ఇచ్చింది. ఇవేవీ తేయాకు మొక్క నుంచి సేకరించినవి కావని స్పష్టం చేసింది. తేయాకు మొక్కల నుంచి సేకరించిన వాటిని మాత్రమే టీగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. కాంగ్రా టీ, గ్రీన్ టీ, ఇన్‌స్టంట్ టీ వంటి రకాలను టీగా వ్యవహరించొచ్చని పేర్కొంది. ఇవి తప్ప తేయాకు సంబంధం లేని ఉత్పత్తులను టీగా వ్యవహరించొద్దని పునరుద్ఘాటించింది. అలా చేయడం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006ను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేసింది. కాబట్టి ఇ-కామర్స్ సంస్థలు, తయారీదారులు, ప్యాకింగ్, మార్కెటింగ్, దిగుమతిదా



రులు, విక్రేతలంతా ఈ నిబంధనలు పాటించాలని స్పష్టం చేసింది. క్షేత్ర స్థాయిలో ఈ ఆదేశాలు అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకోవాలని సూచించింది.






# 10 ఏళ్లలో పెట్రోల్ పంపులు డబుల్..

## అత్యధికం ఈ కంపెనీ చేతిలోనే..

**దిల్లీ:** దేశంలో పెరుగుతున్న వాహన వినియోగానికి అనుగుణంగా పెట్రోల్ పంపుల సంఖ్యా నానాటికీ పెరుగుతోంది. ఈ ఏడాది నవంబర్ నాటికి 1,00,266కి చేరింది. 2015తో పోలిస్తే ఈ సంఖ్య రెట్టిపైంది. అమెరికా, చైనా తర్వాత అత్యధిక పెట్రోల్ పంపులు కలిగిన దేశంగా భారత్ మూడో స్థానంలో నిలిచింది. ఈ మేరకు చమురు మంత్రిత్వ శాఖ పరిధిలోని పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్ డేటాలో వెల్లడైంది. దేశంలో పెట్రోల్ పంపుల్లో సింహభాగం ప్రభుత్వరంగ సంస్థలదే. ఇండియన్ ఆయిల్ కార్పరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్తంగా 90శాతం వాటా కలిగి ఉన్నాయి. రష్యా రాస్‌నెఫ్ట్ మద్దతు కలిగిన నయరా ఎనర్జీ లిమిటెడ్‌కు దేశవ్యాప్తంగా 6,921 ఔట్‌లెట్లు ఉండగా.. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, బీపీ జాయింట్ వెంచర్‌కు 2,114 స్టేషన్లు ఉన్నాయి. షెల్ కంపెనీ 346 పెట్రోల్ పంపులు నిర్వహిస్తోంది.

### 10 ఏళ్లలో డబుల్

2015 నాటికి దేశంలో 50,451 పెట్రోల్ స్టేషన్లు ఉన్నట్లు పీపీఏసీ గణాంకాలు చెబుతున్నాయి. అప్పట్లో ప్రైవేటు కంపెనీలు 5.9 శాతం వాటాతో 2,967 ఔట్‌లెట్లు మాత్రమే కలిగి ఉండేవి. నేడు వాటి మార్కెట్ వాటా 9.3 శాతానికి పెరిగింది. 2004లో 27 బంకులతో ప్రైవేటు కంపెనీలు ఈ మార్కెట్‌లోకి ప్రవేశించాయి. ప్రపంచవ్యాప్తంగా చూసినప్పుడు అమెరికాలో అత్యధిక పెట్రోల్ పంపులు ఉన్నాయి. 2024 నాటి లెక్కల ప్రకారం 1,96, 643 రిటైల్ గ్యాస్ స్టేషన్‌లు ఉన్నాయనేది అంచనా. ఆ తర్వాత కొన్ని మూతపడ్డాయి. చైనాలో 1,15,228 గ్యాస్ స్టేషన్లు ఉన్నాయి. చైనాకు చెందిన సినోపెక్ 30 వేలకు పైగా గ్యాస్ స్టేషన్లు నిర్వహిస్తూ అగ్రస్థానంలో ఉంది.

### భారత్‌లో ఐఓసీదే అగ్రస్థానం

దేశీయ పెట్రోల్ పంపులు అత్యధికంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చేతిలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా 41,664 ఔట్‌లెట్లను ఈ సంస్థ నిర్వహిస్తోంది. 24,605 స్టేషన్లతో బీపీసీఎల్, 24,418తో హెచ్‌పీసీఎల్ మూడో స్థానంలో ఉన్నాయి. మొత్తం బంకుల్లో 29 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. దశాబ్దం క్రితం ఈ సంఖ్య 22 శాతంగా ఉండేది. ఒకప్పుడు పెట్రోల్, డీజిల్ మాత్రమే విక్రయించే ఔట్‌లెట్లు.. నేడు సీఎన్‌జీ, ఈవీ ఛార్జింగ్ పాయింట్లనూ ఏర్పాటు చేసుకుంటున్నాయి. పెట్రోలియం ఉత్పత్తుల ధరలపై పరోక్షంగా ప్రభుత్వ నియంత్రణ ఉండడంతో రెండు దశాబ్దాల తర్వాత కూడా ఈ రంగంలో ప్రైవేటు కంపెనీల వాటా నామమాత్రంగానే ఉంది. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా రోజువారీ ధరలను నిర్ణయించే అధికారం ప్రభుత్వం ఎప్పుడో మార్కెట్ శక్తులకు వదిలేసినప్పటికీ.. 2021 నవంబర్ నుంచి వాటి ధరల్లో మార్పు ఉండడం లేదు.



## వడాపావ్ తింటావా..

# రోహిత్ భయ్యా

### ఆట పట్టించిన ఫ్యాన్

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా జైపుర్ వేదికగా బుధవారం ముంబయి, సిక్కిం తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ముంబయి 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ముంబయి తరఫున అద్భుత ప్రదర్శన చేశాడు. 62 బంతుల్లోనే సెంచరీ చేశాడు. చివరికి 155 (94 బంతుల్లో 18 ఫోర్లు, 9 సిక్స్‌లు) పరుగుల వద్ద వెనుదిరిగాడు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డునూ సొంతం చేసుకున్నాడు. అయితే మ్యాచ్ సందర్భంగా రోహిత్ ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు ఓ ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకొంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో రోహిత్ శర్మను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు మైదానానికి చేరుకున్నారు. 'ముం బయి రాజా' అంటూ రోహిత్‌ను ఉద్దేశించి నినాదాలు చేశారు. ఓ అభిమాని మాత్రం ఓ అడుగు ముందుకేసి రోహిత్ శర్మను సరదాగా ఆట పట్టించాడు. 'రోహిత్ భాయ్ వడాపావ్ కాయేగీ క్యా' (రోహిత్ అన్నా.. వడపావ్ తింటావా?) అంటూ అడిగాడు. దీనికి రోహిత్ శర్మ కూడా అంతే స్పోర్టివ్‌గా స్పందించాడు. తినను అని చేతితో సంజ్ఞ చేశాడు. దీంతో అభిమానులంతా గట్టిగా అరుస్తూ సంబరాలు చేసుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రోహిత్ శర్మ ఇటీవల తన ఫిట్‌నెస్‌పై శ్రద్ధ పెట్టాడు. దాదాపు పది కిలోల వరకు బరువు తగ్గాడు. ఆహార నియమాలు పాటిస్తున్నాడు. ఈ మధ్యే.. విశాఖపట్నంలో టీమ్‌ఇండియా, దక్షిణాఫ్రికాకు జరిగిన వన్డే మ్యాచ్‌లో యశస్వి జైస్వాల్ సెంచరీ చేశాడు. అతడికి వన్డేల్లో ఇదే తొలి శతకం కావడంతో అతడు కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్నాడు. ఈసందర్భంగా యశస్వి జైస్వాల్.. రోహిత్ శర్మకు కేక్ ఆఫర్ చేశాడు. రోహిత్ దాన్ని సున్నితంగా తిరస్కరించాడు. 'కేక్ తింటే మళ్లీ లావై పోతాను' అన్నాడు. దీంతో అక్కడ నవ్వులు విరిశాయి. రోహిత్ శర్మకు వడాపావ్ అంటే ఎంతో ఇష్టం. కానీ ప్రస్తుతం అతడు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటున్నాడు. వన్డే వరల్డ్ కప్ 2027లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నాడు.

## జట్టులోకి రావడానికి జైస్వాల్ ఇంకా ఏం చేయాలి?: వెంగ్‌సర్కార్



2026 టీ20 ప్రపంచకప్ కోసం ఇటీవల భారత సెలక్టర్లు జట్టును ప్రకటించారు. యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌కు జట్టులో చోటు కల్పించకపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. మూడు ఫార్మాట్లలో ఆడగలిగే సత్తా ఉన్న అతడిని ఎందుకు పక్కన పెట్టారని అభిమానులు సోషల్ మీడియాలో ప్రశ్నించారు. తాజాగా భారత మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా ఈ అంశంపై స్పందిస్తూ.. జట్టులోకి రావడానికి జైస్వాల్ ఇంకా చేయాలి?అంటూ ఫైర్ అయ్యాడు. 'అతని తప్పు లేకుండానే యశస్వి జైస్వాల్‌ను పదే పదే తప్పించడం దురదృష్టకరం. అతను ఆటలోని అన్ని ఫార్మాట్లలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. జట్టులోకి రావడానికి అతను ఇంకా ఏం చేయాలో నాకు తెలియదు. మ్యాచ్ విన్నర్‌ను ఎవరూ జట్టు నుంచి తప్పించకూడదు. టీ20 ప్రపంచకప్‌నకు ఎంపికైన వారంతా నాణ్యమైన ఆటగాళ్లే. శుభ్‌మన్ గిల్ విషయంలో సెలక్టర్లు తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తా. గిల్‌కి బదులు ఎవరిని ఎంచుకుంటారని మీరు అడిగితే నేను జైస్వాల్ వైపు మొగ్గుచూపుతా. అతను క్లాస్ పెర్ఫార్మర్‌గా పదే పదే నిరూపించుకున్నాడు. ఎన్నోసార్లు జట్టుకు శుభారంభాలు అందించాడు. ఏ ఆటగాడినైనా ఒక ఫార్మాట్‌లో వరుసగా జట్టు నుంచి తప్పిస్తే ఇక తన అవసరం లేదని భావించి ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతాడు. క్రికెట్‌లో ఆత్మవిశ్వాసం అనేది చాలా ముఖ్యం' అని వెంగ్‌సర్కార్ అన్నాడు. యశస్వి జైస్వాల్ టీమ్‌ఇండియా తరఫున జులై 2024లో చివరి టీ20 మ్యాచ్ ఆడాడు. తర్వాత అతను టెస్టులపై ఎక్కువ ఫోకస్ పెట్టేలా టీమ్‌మేనేజ్‌మెంట్ ప్రోత్సహించింది. జనవరి 11 నుంచి కివీస్‌తో భారత్ మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది. ఆ సిరీస్‌కు జైస్వాల్ ఎంపికైనా.. బెంచ్‌కే పరిమితమవడం ఖాయంగా కనిపిస్తోంది. ఎందుకంటే రెగ్యులర్ వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. రోహిత్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేస్తాడు.

## వైభవ్ సూర్యవంశీకి

# టీమ్‌ఇండియాలో చోటివ్వాలి

### కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్



కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్.. వైభవ్ సూర్యవంశీని సచిన్ తెందుల్కర్‌తో పోల్చారు. సూర్యవంశీకి టీమ్‌ఇండియాలో చోటివ్వాలని సోషల్‌మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ఐపీఎల్ సంచలనం వైభవ్.. కొంతకాలంగా భీకరమైన ఫామ్‌లో ఉన్నాడు. తాజాగా విజయ్ హజారే ట్రోఫీలోనూ బిహార్ తరఫున అరుణాచల్‌ప్రదేశ్‌పై 84 బంతుల్లోనే 190 పరుగులు చేశాడు. తృటిలో డబుల్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వైభవ్ ప్రతిభను సచిన్ తెందుల్కర్‌తో పోల్చాడు. అలాగే వైభవ్‌కు టీమ్‌ఇండియా తరఫున ఆడేందుకు అవకాశమివ్వాలని కోచ్ గౌతమ్ గంభీర్, బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌కు సూచించాడు. 'గతంలో 14 ఏళ్ల వయసులో సచిన్ తెందుల్కర్ అద్భుతమైన ప్రతిభను కనబరిచాడు. తర్వాత అతడు ఏ స్థాయికి చేరుకున్నాడో మనందరికీ తెలుసు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ కూడా టీమ్‌ఇండియా తరఫున ఆడేందుకు ఎదురుచూస్తున్నాడు' అని శశిథరూర్ 'ఎక్స్' వేదికగా పోస్ట్ పెట్టాడు. బుధవారం రాంచీ వేదికగా బిహార్, అరుణాచల్‌ప్రదేశ్‌కు మధ్య జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీతోపాటు, సకీబుల్ గని, ఆయుష్ లోహరుక సెంచరీలు సాధించారు. దీంతో బిహార్ జట్టు రికార్డ్ స్థాయిలో నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఏకంగా 574 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్ ప్రదేశ్ 42.1 ఓవర్లలో 177 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఈ మ్యాచ్‌లో బిహార్ 397 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

# బెంగళూరు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ శ్రేయస్ అయ్యర్



గాయం బారినపడిన బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టడంపై దృష్టి సారించాడు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్యాటింగ్ చేస్తున్న అతను గురువారం బెంగళూరులో ఉన్న బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కి వెళ్లాడు. 'శ్రేయస్ అయ్యర్ దురదృష్టవశాత్తు గాయపడ్డాడు. దీంతో అతను చాలా మ్యాచ్‌లకు దూరమయ్యాడు. మంచి విషయం ఏంటంటే.. ప్రస్తుతం అతడు నొప్పి లేకుండా ఉన్నాడు. బుధవారం ముంబయిలో ఎలాంటి ఇబ్బందీ లేకుండా బ్యాటింగ్ చేశాడు. రెగ్యులర్‌గా జిమ్‌లో కసరత్తులు చేస్తున్నాడు. నాలుగైదు రోజుల పాటు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గడుపుతాడు. అక్కడ అయ్యర్ ఫిట్‌నెస్‌ను మెడికల్, స్పోర్ట్స్ సైన్స్ స్టాఫ్ అంచనా వేస్తుంది' అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. జనవరి 11 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కోసం జనవరి 2 లేదా 3న జట్టును ప్రకటించనున్నట్లు సమాచారం. క్లియరెన్స్ వస్తే అయ్యర్‌ను జట్టులోకి తీసుకునే అవకాశముంది.

## ధోనీకి ప్రతి ఆటగాడి గురించి తెలుసు

# ఆయన వల్లే ఈ విజయం..



ఇటీవల ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఝార్ఖండ్ ఛాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఝార్ఖండ్ జట్టు.. ఫైనల్‌లో హరియాణాపై విజయం సాధించి తొలిసారి టైటిల్‌ను సొంతం చేసుకుంది. అయితే, ఈ విజయం వెనుక భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ కీలకపాత్ర పోషించాడట. ఈ విషయాన్ని టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్, ప్రస్తుతం ఝార్ఖండ్ క్రికెట్ సంఘం జాయింట్ సెక్రెటరీగా కొనసాగుతున్న షాబాజ్ నదీమ్ వెల్లడించాడు. రాష్ట్రంలో క్రికెట్ పునర్నిర్మాణం, భవిష్యత్తు ప్రణాళిక కోసం తాము ధోనీ నుంచి సలహాలు కోరినట్లు నదీమ్ తెలిపాడు. 'దేశవాళీ సీజన్ ప్రారంభమైనప్పుడు ధోనీని సంప్రదించాం. కోచింగ్ సిబ్బంది నియామకం నుంచి ప్రతి విషయంలోనూ అతని సలహాలు, సూచనలు తీసుకున్నాం. ధోనీ సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నమెంట్ విషయంలో అన్ని విషయాలు దగ్గరుండి చూసుకున్నాడు. ఆటగాళ్ల బలాలు, బలహీనతలను గుర్తించాడు. మాతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపాడు. ఝార్ఖండ్‌కు చెందిన ప్రతి దేశవాళీ ప్లేయర్ గురించి ధోనీకి అన్ని విషయాలు తెలుసు. ఝార్ఖండ్ క్రికెట్ అభివృద్ధికి సహాయపడాలని అతనికి చాలా ఆసక్తి ఉంది' అని షాబాజ్ నదీమ్ వివరించాడు. ఇషాన్ కిషన్ టోర్నమెంట్‌లో అదరగొట్టి తిరిగి జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు. 2026 టీ20 ప్రపంచ కప్ జట్టులో ఇషాన్‌కు అవకాశం కల్పించారు. టోర్నీలో మొత్తం 517 పరుగులు చేసిన చేసిన అతను.. ఫైనల్‌లో 49 బంతుల్లో 101 పరుగులు చేశాడు. దీంతో ఝార్ఖండ్ 3 వికెట్ల నష్టానికి 262 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో హరియాణా 193 పరుగులకే పరిమితమైంది. 2019లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ.. ఐపీఎల్‌లో కొనసాగుతున్న విషయం తెలిసిందే.




## దేశవ్యాప్త సమ్మెకు దిగిన గిగ్ వర్కర్లు..

### స్విగ్గీ, జొమాటో సేవలపై ఎఫెక్ట్

ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్, ఇ-కామర్స్ విభాగాల్లో సేవలందిస్తున్న గిగ్ వర్కర్లు దేశవ్యాప్తంగా సమ్మెకు దిగారు. వేతనాలు, పని పరిస్థితులు, ఉద్యోగ, సామాజిక భద్రత వంటి డిమాండ్లతో ఆందోళన చేపట్టారు. డిసెంబర్ 25, డిసెంబర్ 31న రెండు రోజుల పాటు సమ్మె చేపడుతున్నారు. దీంతో స్విగ్గీ, జొమాటో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సేవలపై దీని ప్రభావం కనిపిస్తోంది. ఈ మేరకు ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల యూనియన్ పిలుపునిచ్చాయి. స్విగ్గీ, జొమాటో, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఫుడ్ డెలివరీ, క్విక్‌కామర్స్, ఇ-కామర్స్ సేవల విభాగంలో పనిచేస్తున్న వర్కర్లు ఈ సమ్మెలో పాల్గొనాలని యూనియన్లు కోరాయి. గిగ్ వర్కర్ల పరిస్థితి రోజురోజుకూ దారుణంగా తయారవుతోందని టీజీపీడబ్ల్యూయూ వ్యవస్థాపకుడు షేక్ సలావుద్దీన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్కర్ల ఆదాయాలు పడిపోతున్నాయని, సామాజిక భద్రత ఉండడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయం, గౌరవం, జవాబుదారీతనం కోరుతూ ఈ సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఓవైపు గిగ్‌వర్కర్ల శ్రమతో కంపెనీలు లాభాలు మూటగట్టుకుంటూ ఉంటే.. ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం సరికాదన్నారు. ప్రభుత్వం దీనిపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. 10 నిమిషాల్లో డెలివరీ మోడల్‌ను తక్షణమే విత్‌డ్రా చేసుకోవాలని డిమాండ్ చేశారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్త లేబర్ కోడ్‌లలో కొన్ని నిబంధనలు పొందుపరిచిన వేళ డెలివరీ వర్కర్లు ఈ సమ్మెకు దిగారు. అగ్రిగేటర్లు తమ వార్షిక టర్నోవర్‌లో 1-2% (కార్మికులకు చెల్లించే మొత్తంలో 5% వరకు) సామాజిక భద్రత నిధికి కేటాయించడం తప్పనిసరి చేసింది. దీంతో పాటు వారికి ఆరోగ్య, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించింది. కొత్త లేబర్ కోడ్‌లలో నిబంధనలను తాము అమలుచేస్తామని స్విగ్గీ, జొమాటో పేర్కొన్నాయి. దీనివల్ల తమ వ్యాపారంపై గానీ, ఆర్థికంగా గానీ అంతగా ప్రభావం ఉండబోదని స్పష్టంచేశాయి. ఈ నేపథ్యంలో గిగ్‌వర్కర్లు పలు డిమాండ్లతో సమ్మెకు దిగడం గమనార్హం.

